

సాగర్ కుడి కాల్వ



గుంటూరులో ఎల్-1ని తప్పించి జిన్నింగ్ కోసం ఎంపిక చేసిన ఎల్-3 మిల్లు

చిన్న మిల్లులకు.. పెద్దపీట



గుంటూరులో మిల్లు లోపల ఏర్పాటుచేసిన సీసీఐ కొనుగోలు కేంద్రం ఫ్లెక్సీలు

- సీసీఐ జిన్నింగ్ మిల్లుల ఎంపికపై దుమారం
- కావాల్సినట్లు నిబంధనలను మార్చేశారని విమర్శలు
- తెలంగాణలో ఒక తీరుగా.. ఇక్కడ మరొక రకంగా ప్రక్రియ
- కావాల్సిన మిల్లుల కోసం కొన్నింటిని తప్పించిన అధికారులు
- గుంటూరులో రూ.1199 బిడ్ వేసినా.. కాదని మరొక మిల్లు ఎంపిక

గుంటూరు సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) పత్తి జిన్నింగ్‌కు ఒక్కో బేలుకు రూ.1350 చొప్పున మిల్లర్లకు చెల్లిస్తుంది. అందుకు పెద్ద, చిన్న పత్తి మిల్లుల యజమానులు ఒప్పుకుని బిడ్డింగ్ వేశారు. ఈ క్రమంలో ఎక్కువ మిషన్లు కలిగి, అధిక సౌకర్యాలు ఉన్న మిల్లులకు ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే నిబంధనలకు విరుద్ధంగా తగిన సామర్థ్యం లేకున్నా.. సౌకర్యాలు లేని చిన్న మిల్లులకు సీసీఐ అధికారులు పెద్దపీట వేశారు. కావాల్సిన వారి మిల్లులను ఎంపిక చేసేందుకు కొందరిని పక్కకు తప్పించారన్న విమర్శలున్నాయి. జిన్నింగ్ మిల్లుల ఎంపికపై దుమారం చెలరేగుతుంది. సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు ఆగస్టులో ప్రకటన విడుదల చేశారు. తెలుగు రాష్ట్రంలో ఇంగ్లీషు ప్రకటన వెలువడటం మొదట్లోనే వివాదమైంది. తెలంగాణలో సుమారు 390 మిల్లులను జిన్నింగ్‌కు ఎంపిక చేశారు. ఇక్కడ కేవలం 30 కేంద్రాలనే ఎంపిక చేశారు. గత ఏడాది సుమారు 70 పత్తి మిల్లులను ఎంపిక చేయగా ఈ ఏడాది అందులో సగం కూడా చేయలేదు. మిల్లులు ఎందుకు తగ్గించారో అధికారులు సరిగా వివరణ ఇవ్వలేదు. జిన్నింగ్‌కు ఒక్కో బేలుకు రూ.1350 ఇస్తామని సీసీఐ ఆఫర్ చేసింది. తెలంగాణలో అందరికీ అదే ధర చెల్లిస్తుంది. ఇక్కడ మాత్రం మిల్లర్లు తగ్గింపు ధరకు వేసేలా కొందరు బయ్యర్లు ప్రోత్సహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. జిన్నింగ్ కోసం మిల్లులు ఎంపికలో సామర్థ్యాన్ని బట్టి ఎల్-1, ఎల్-2, ఎల్-3గా విభజించారు. ఎంపికలో మొదటి ప్రాధ్యానం ఎల్-1కే ఇవ్వాలి. అయితే గతంలో ఎన్నడూ లేనివిధంగా వసతులు లేని, కనీసం ఐదు లారీల పత్తి కూడా పట్టని మిల్లులకు పెద్దపీట వేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎంపికలో గోల్‌మాల్ జరిగినట్లు మిల్లుల యజమానులు ఆరోపిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి బిడ్డింగ్ ప్రక్రియ మొదలైన తర్వాత ఆన్‌లైన్‌లో నిబంధనలను పలుమార్లు మార్చినట్లు చెబుతున్నారు. టెండర్లు వేశాక నిబంధనలు మార్చుతూ రావడంలోనే లోపాయకారి వ్యవహారం ఉన్నట్లు అర్థమవుతుందని ఆరోపించారు.

ఎల్-1ను తప్పించి ఎల్-3 ఎంపిక

పేరేచర్ల సెంటర్‌కు గతంలో చాలామంది మిల్లుల యజమానులు పోటీ పడ్డారు. ఈసారి కేవలం ఒకే ఒక బిడ్ పడింది. సీసీఐకి సంబంధించి కొనుగోళ్లలో ముఖ్య పాత్ర పోషించే వ్యక్తి ఇక్కడ కీలకపాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గుంటూరు సెంటర్ కోసం ఓ మిల్లు యజమాని రూ.1199కే బిడ్ వేశారు. అయితే నచ్చిన వ్యక్తికి ఇచ్చేందుకు 36 జిన్నింగ్ మిషన్లు కలిగిన పెద్ద మిల్లైన ఎల్-1ను తప్పించి కనీస సౌకర్యాలు లేని ఎల్-3కి ఓ ముఖ్యమైన వ్యక్తి ఆసక్తితో అవకాశం ఇచ్చారు. పుల్లడిగుంట సమీపంలోని సెంటర్ విషయంలోనూ ఇలాగే జరిగింది. గతంలో సీబీఐ కేసులో ఉన్న మిల్లును కూడా ఈసారి ఎంపిక చేశారు. తెలంగాణకు చెందిన కొందరు సీసీఐ కేంద్రాల్లోకి ఎంట్రీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

నిబంధనల ప్రకారమే ఎంపిక

జిన్నింగ్ మిల్లుల ఎంపికలో సీసీఐ ఎక్కడా నిబంధనలను అతిక్రమించలేదు. ఎంపికలో మొదట ఎల్-1 మిల్లులకే ప్రాధాన్యం ఇచ్చాం. ఆన్‌లైన్‌లో నిబంధనలు మార్పులు జరగలేదు. ఇతర శాఖలను పరిగణనలోకి తీసుకునే కేంద్రాలలను ఎంపిక చేశాం.

- అమర్నాథ్‌రెడ్డి, సీసీఐ బీఎం

ఉత్తుత్తి కేంద్రాలే

పత్తి కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా సీసీఐ వ్యవహరిస్తుందన్న ఆరోపణలున్నాయి. ధర లేక రైతులు అల్లాడుతున్నా సీసీఐ మాత్రం కొనుగోలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తుందన్న విమర్శలున్నాయి. గుంటూరు జిల్లాలో ఐదు పత్తి కేంద్రాలు సోమవారం నుంచి తెరిచినట్లు చెబుతున్నా ఒక్క కిలో పత్తి కూడా కొనుగోలు చేయలేదు. అసలు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు తెరిచిందన్న సమాచారం రైతులకు తెలియదు. సాధారణంగా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలను పిలిచి ప్రారంభించాలి. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఏ ఒక్క ప్రజాప్రతినిధికి కూడా సీసీఐ కేంద్రాల ఏర్పాటుపై సమాచారం లేదు. గుంటూరు హౌసింగ్ బోర్డ్ సమీపంలోని కేంద్రం వద్ద కనీసం బోర్డు కూడా ఏర్పాటు చేయలేదంటే అధికారులకు కొనుగోళ్లపై ఏపాటి ఆసక్తి ఉందో తెలుస్తోంది.

వరద.. విద్యుత్

వరద పోటెత్తుతుండగా.. జల విద్యుత్ కొనసాగుతూ ఉంది. గతంలో ఎన్నడూ లేనట్లుగా మూడు నెలల నుంచి నాగార్జున సాగర్ జలాశయం నుంచి దిగువకు నీటి విడుదల జరుగుతుండగా కుడి కాల్వ పరిధిలోని జల విద్యుత్ కేంద్రాలు నిరంతరాయంగా పని చేస్తూనే ఉన్నాయి. నిరాటంకంగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతూ ఉంది. రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు ప్రసరింప చేస్తున్నాయి. సాగు నీటి సరఫరా కుడి కాల్వకు పుష్కలంగా జరుగుతుండగా.. ఆయకట్టు పరిధిలో ఒకవైపు పంటలతో కళకళలాడు తోంది. మరోవైపు విద్యుత్ పెద్దఎత్తున ఉత్పత్తి జరుగుతోంది. రాష్ట్రానికి అవసరమైన విద్యుత్ కొరతను సాగర్ కుడి కాల్వ తీరుస్తోంది. మరో వైపు టెయిల్‌పాండ్ ప్రాజెక్టు నుంచి కూడా భారీగా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. కుడికాల్వ.. టెయిల్ పాండ్ ప్రాజెక్టు విద్యుత్‌కు ఖిల్లాగా నిలిచింది. కుడి కాల్వ పరిధిలోని ఆయా కాల్వలపై, కుడిగట్టు విద్యుత్ కేంద్రాల ద్వారా ప్రతిరోజూ 79.25 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.

- కుడి కాల్వ జల విద్యుత్ ఖిల్లా
- రోజూ 79.25 మెగా వాట్ల ఉత్పత్తి
- టెయిల్‌పాండ్ నుంచి ఒక మిలియన్..
- విద్యుత్ ఉత్పతిలో కీలకంగా ప్రాజెక్టులు
- 128 లక్ష్యానికి ఇప్పటికి 95.509 ఎంయూ ఉత్పత్తి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
కృష్ణానదికి వరద పోటెత్తుతుండగా గతంలో ఎన్నడూ లేనట్లు సాగర్ జలాశయానికి వరద ప్రవాహం ఉంది. నదీ పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలతో సాగర్‌కు వరద వస్తోంది. జూలైలో ప్రారంభమైన వరద ఇప్పటికీ కొనసాగుతోంది. సాగర్ జలాశయం ద్వారా ఆగస్టు మొదటి వారం నుంచి కుడికాల్వకు నీరు విడుదల చేస్తున్నారు. కుడి కాల్వకు 10,160 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో కుడి గట్టు మీద ఉన్న జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పతి జరుగుతోంది. 1983లో రెండు యూనిట్లు, 1990లో ఒక యూనిట్‌ను వినియోగంలోకి తీసుకువచ్చారు. రెండు యూనిట్ల ద్వారా 35 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. మూడో యూనిట్ ద్వారా కూడా విద్యుత్ ఉత్పత్తికి అధికారులు చర్యలు చేపడుతున్నారు. యూనిట్ ఒకటి ద్వారా 0.422 మిలియన్ యూనిట్లు, రెండో యూనిట్ ద్వారా 0.404 మినియన్ యూనిట్లు మొత్తంగా 0.826 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేస్తున్నట్లు సంబంధిత అధికారి తెలిపారు. ఈ నెల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 24 మిలియన్ యూనిట్లు కాగా ఇప్పటికీ 23.928 మినియన్ యూనిట్లు ఉత్పత్తి చేశారు. ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి 128 మిలియన్ యూనిట్ల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 95.509 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి జరిగింది. కుడి గట్టు కేంద్రాల ద్వారా జరిగే విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రానికి వస్తుంది. మార్చి వరకు విద్యుత్ ఉత్పత్తి కొనసాగుంతుందని అంచనా.

కుడి గట్టు విద్యుత్ కేంద్రంలో ఇలా..

ఒకటో యూనిట్ -	0.422 ఎంయూ
రెండో యూనిట్ -	0.404 ఎంయూ
టెయిల్ పాండులో రెండు ప్లాంట్లు -	1.02 ఎంయూ
27 జల విద్యుత్‌కేంద్రాలు	- 4.25 మెగావాట్లు

కుడి కాల్వపై 27 జల విద్యుత్ కేంద్రాలు


కుడికాల్వ పరిధిలో 27 జలవిద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. వీటి సామర్థ్యం 44.25 మెగావాట్లు కాగా రోజుకు 9.55 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. కుడి కాల్వకు నీటి సరఫరా ఉంటే ఈ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. గుంటూరు బ్రాంచ్ కెనాల్ పరిధిలో 22.9 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన 14 విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో 8(16.7 మెగా వాట్లు), బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్ పరిధిలో 2.4 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు, ఒంగోలు బ్రాంచ్ కెనాల్‌పై 1.5 మెగావాట్ల సామర్థ్యంతో ఒకటి, జూలకట్టు బ్రాంచ్ కెనాల్‌పై ఒక మెగావాట్ సామర్థ్యం కలిగిన ఒక ప్లాంట్ ఉంది.

311.75 టీఎంసీల నీటి నిల్వ

సాగర్ జలాశయం నిండుకుండలా ఉంది. నీటి నిల్వ పూర్తి స్థాయికి చేరింది. జలాశయానికి 62,644 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. ఇక్కడ నుంచి 69,029 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా సోమవారం 311.75 టీఎంసీల నిల్వ ఉంది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 590 అడుగులు కాగా ప్రస్తుతం 589.9 అడుగులు ఉంది.

రివర్సబుల్ టర్బయిన్ల ద్వారా..

సాగర్‌కు దిగువన రెంటచింతల మండలం సత్రశాల సమీపంలో టెయిల్‌పాండ్ ప్రాజెక్టు నిర్మించారు. ఈ ప్రాజెక్టు 2017లో వినియోగంలోకి వచ్చింది. సాగర్ జలాశంలో నీటి నిల్వలు తక్కువగా ఉన్నప్పుడు జలవిద్యుత్ ద్వారా విడుదల చేసిన నీటిని నిల్వ చేసి మళ్లీ తిరిగి జలాశంయలోకి ఎత్తిపోయడానికి నిర్మించిందే టెయిల్‌పాండ్ ప్రాజెక్టు. దీని నీటి నిల్వ సామర్థ్యం ఆరు టీఎంసీలు. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వ బ్యాక్ వాటర్ సాగర్ డ్యామ్ వరకు నిలుస్తుంది. నీటిని రివర్సబుల్ టర్బయిన్ల ద్వారా జలాశయంలోకి ఎత్తిపోస్తారు. నదికి వరద ఉన్న సమయంలో జలవిద్యుత్ ఉత్పత్తి చేయడానికి వీలుగా 25 మెగా వాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు ఉన్నాయి. వీటికి 50 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. రెండు ప్లాంట్ల నుంచి రోజూ 1.02 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. వరద నీరు కొనసాగుతుండటంతో ఆగస్టు నుంచి ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.



సాగర్ జలాశయం



టెయిల్ పాండ్ ప్రాజెక్టు



సాగర్ కుడి కాల్వపై ఉన్న ప్లాంట్



గుంటూరు బ్రాంచ్ కెనాల్‌పై విద్యుత్ ప్లాంట్


మాజీ మంత్రి రజిని పీచేముడ్

- చిలకలూరిపేట ఇన్‌చార్జిగా వెళ్లే యత్నం
- మాజీ మంత్రి అంబటి సత్తెనపల్లి నుంచి పరారీ
- గుంటూరు పశ్చిమ వైపు మేయర్ మనోహర్ చూపు


గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి వ్యతిరేకంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో వీచిన గాలుల్లో ఘోర పరాజయాన్ని చూసిన మాజీ మంత్రులు వచ్చే ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు తగిన నియోజకవర్గాల్ని ఎంచుకునే పనిలో పడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో మంత్రులుగా వ్యవహరించిన విడదల రజిని, అంబటి రాంబాబు గత ఎన్నికల్లో తాము పోటీ చేసిన నియోజకవర్గాలను వీడి వేరే నియోజకవర్గాల ఇన్‌చార్జిలుగా బాధ్యతలు చేపట్టేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. 2019 ఎన్నికల్లో చిలకలూరిపేట నుంచి పోటీ చేసి గెలుపొందిన రజిని మంత్రి పదవిని చేపట్టారు. మంత్రిగా ఉన్న సమయంలో తన వ్యవహారశైలితో సొంత నియోజకవర్గం సొంత పార్టీలో వ్యతిరేకత కూడగట్టుకున్నారు. ఈ క్రమంలో ఓటమి భయంతో 2024 ఎన్నికల్లో గుంటూరు పశ్చిమకు వలస వచ్చారు. ఇక్కడ ఘోర ఓటమితో ఆమె పునరాలోచనలో పడ్డారు. రజిని గుంటూరు పశ్చిమకు వలస రావడంతో చిలకలూరిపేట నుంచి పోటీ చేసే అవకాశం దక్కించుకుని ఓడిపోయిన నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు కూడా వచ్చే ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జిగా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. తొలుత చిలకలూరిపేట ఇన్‌చార్జి బాధ్యతలు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌కు ఇవ్వాలని దసరాకు ముందు జగన్ ఆలోచించారు. అయితే రజినికి తిరిగి చిలకలూరిపేట వెళ్లాలనే ఆలోచన కలగటంతో జగన్ ఆమెను కాదనలేకపోయారు. దీంతో నేడో, రేపో ఆమెకు చిలకలూరిపేట బాధ్యతలు అప్పగించనున్నారు. అదే జరిగితే మర్రికి మరోసారి చుక్కెదురు కానుంది. ఇదిలా ఉండగా గత ఎన్నికల్లో సత్తెనపల్లి నుంచి పోటీ చేసి ఓటమి పాలైన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇప్పటికే అక్కడ నుంచి పరారై వచ్చేశారు. ఆయనకు గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని కట్టబెట్టటం ద్వారా పల్నాడు నుంచి ఇక్కడకు వలస తీసుకొచ్చారు. అయితే ఆయన కూడా గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి బాధ్యతలు ఆశించే అవకాశం ఉంది. లేదా అతడి సోదరుడు అంబటి మురళీ గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన పొన్నూరు బాధ్యతలను రాంబాబుకు అధిష్టానం అప్పగించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది.



మాజీ మంత్రి రజినీ



మాజీ మంత్రి రాంబాబు




మేయర్ మనోహర్‌నాయుడు



ఓటర్లు.. 17,95,789

- స్వల్పంగా పెరిగిన ఓట్లు
- జిల్లాలో మహిళా ఓటర్లే అధికం
- క్లెయిమ్, అభ్యంతరాల స్వీకారం ప్రారంభం
- వచ్చే నెల 28 వరకు దాఖలుకు అవకాశం



గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 2025 స్పెషల్ సమ్మరి రివిజన్‌ని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇందులో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ మంగళవారం సాయంత్రం విడుదల చేశారు. దీని ప్రకారం జిల్లాలో ఓటర్ల సంఖ్య 17 లక్షల 95 వేల 789గా ఉన్నది. ఇందులో పురుషులు 8 లక్షల 68 వేల 400 కాగా మహిళలు 9 లక్షల 27 వేల 231, ట్రాన్స్‌జెండర్లు 158 మంది ఉన్నారు. గత 2024 ఎస్ఎస్ఆర్ తుది ఓటర్ల జాబితా ప్రచురించినప్పుడు 17 లక్షల 91 వేల 543 మంది ఓటర్లున్నారు. ఆ సంఖ్యతో పోల్చితే ఈసారి 4,246 మంది ఓటర్లు పెరిగారు. ఇప్పట్లో ఎలాంటి ఎన్నికలు లేని కారణంగా ఓటరు నమోదు, చిరునామాల మార్పు, తొలగింపులపై రాజకీయ పార్టీలు కూడా పెద్దగా ఆసక్తి కనబరచడంలేదు. మంగళగిరి నియోజకవర్గంలో అత్యధికంగా ఓటర్లు నమోదు కాగా తాడికొండలో తక్కువగా ఉన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఏటా ఓటరు జాబితాలను స్వచ్ఛీకరణ చేసేందుకు స్పెషల్ సమ్మరి రివిజన్ ప్రక్రియ చేపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎస్ఎస్ఆర్-2025 షెడ్యూల్‌ని ఇదివరకే ప్రకటించింది. కాగా మంగళవారం ముసాయిదా జాబితాని విడుదల చేసి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించడం ప్రారంభించింది. వచ్చే నెల 28 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు తీసుకుని డిసెంబరు 24 లోపు వాటిని పరిష్కరించనున్నది. 2025 జనవరి 1న ఓటరు జాబితాలు సక్రమంగా ఉన్నాయో, లేదో సరి చూసుకుని జనవరి 6న తుది ఓటర్ల జాబితాని ప్రచురిస్తుంది. ఓటర్లలో చైతన్యం నింపేందుకు నవంబరు 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నది. ఆయా తేదీల్లో బూత్ స్థాయి అధికారులను పోలింగ్ బూత్‌ల వద్ద అందుబాటులో ఉండేలా చూసి అప్పటి కప్పుడు క్లెయిమ్‌లు, అభ్యంతరాల ఫారంలను పెట్టిస్తుంది. 2025 జనవరి 1కి 18 ఏళ్ల వయస్సు వచ్చే ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేసింది. జూలై ఒకటో తేదీ, అక్టోబరు ఒకటో తేదీకి 18 ఏళ్ల వయస్సు వచ్చేవారు కూడా ఓటరుగా నమోదయ్యేందుకు అర్హులని జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది. గతంలో ఓటరుగా నమోదు కాకుండా మిస్ అయినవారు కూడా ఫారం-6లను అందజేయాలని సూచించింది. ప్రస్తుతం ఓటర్లుగా నమోదై ఉన్నవారు తమ ఆధార్‌ని ఫారం-6బీలో అందజేయాలని కోరింది. జిల్లాలో 18నుంచి 19 ఏళ్ల మధ్య వయసున్న ఓటర్లు 21,431, 80 ఏళ్ల వయసు దాటినవారు 34,881, పీడబ్ల్యూడీ ఓటర్లు 17,389 ఉన్నారు. లింగనిష్పత్తి ప్రతి వెయ్యిమంది పురుషులకు 1070 మంది మహిళలున్నారు. ఈపీ నిష్పత్తి 729గా ఉన్నది.

నియోజకవర్గాల వారీగా....

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	సర్వీసు ఓటర్లు	మొత్తం
తాడికొండ(ఎస్సీ)	100270	107687	2	219	208178
మంగళగిరి	141025	152052	12	133	293222
పొన్నూరు	109139	118232	11	494	227876
తెనాలి	129276	138658	34	291	268559
ప్రత్తిపాడు(ఎస్సీ)	129455	138789	22	362	268628
గుంటూరు పశ్చిమ	135547	142766	42	165	278520
గుంటూరు తూర్పు	121998	128973	35	100	251106

రేషన్ మాఫియా జిమ్మిక్కులు

- ఒకటో తేదీ రాకముందే ఖాళీ అయిన బియ్యం
- ఫిర్యాదుతో రెండు రోజుల క్రితం తనిఖీ చేసిన డీటీ
- డాన్ రంగ ప్రవేశంతో సర్దుబాటు.. నమోదు కాని కేసు

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఒకటో తేదీ నుంచి కార్డుదారులకు అందాల్సిన 200 బస్తాల బియ్యం మాయమయ్యాయి. రెండు రోజుల క్రితం పౌర సరఫరాలశాఖకు ఫిర్యాదు అందడంతో ఓ డీటీ పాత గుంటూరులోని షాపు నెంబరు 99లో చేపట్టిన తనిఖీలో బియ్యం మాయమైన విషయాన్ని గుర్తించి అందుకు ఎండీయూ ఆపరేటరే కారణమని తేల్చారు. అయితే తనిఖీ జరిగి రెండు రోజులు గడుస్తున్నా ఇప్పటివరకూ పౌరసరఫరాల శాఖ అధికారులు కనీస చర్యలు కూడా చేపట్టలేదు. ఆ వాహనదారుడు రేషన్ మాఫియా డాన్ అనుచరుడు కావడంతో అధికారులు మిన్నకుండిపోయారని సమాచారం. కేసు నమోదు చేయకుండా సమయం ఇవ్వడంతో తిరిగి బియ్యాన్ని సదరు షాపులో దింపి కేసు లేకుండా కప్పిపుచ్చేందుకు డాన్ పూనుకున్నాడు. మంగళవారంలోగా బియ్యంలోడు సదరు షాపులో దింపి కేసులేకుండా చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. స్వర్ణభారతినగర్‌లోని 244 నెంబరు షాపునకు 10 గజాల దూరంలోనే మరో ఇల్లు అద్దెకు తీసుకుని దాన్ని స్టాక్ పాయింటుగా పెట్టుకున్నారు. ఆ షాపుకు వచ్చే బియ్యంతో పాటు, ఇతర షాపుల నుంచి వచ్చే అక్రమ బియ్యాన్ని అక్కడ భద్రపరుస్తున్నారు. ఐపీడీ కాలనీలోని 183వ నెంబరు షాపు డీలర్ బంధువుల పేరుతో బదలాయించి, తాజాగా రాజీవ్‌గృహకల్ప సమీపంలోకి మార్చారు. దాన్ని కూడా స్టాక్ పాయింటుగానే వినియోగించుకుంటున్నారు.

లెక్కకు మించిన షాపులు..

మాఫియా డాన్ పరిధిలో లెక్కకు మించిన రేషన్‌షాపులు ఉన్నాయి. ఇతర షాపుల్లో డాన్ పెట్టుబడులు పెట్టి, వారిపై ఆధిపత్యాన్ని నెరుపుతున్నాడని సమాచారం. డాన్ పరిధిలో 40కి పైగా రేషన్ షాపులు వున్నాయి. నగరంలోని 43, 44, 45, 55, 86, 9, 124, 135, 115, 181, 119, 193, 161, 22, 17, 15, 194, 4 నెంబరు షాపులన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రేషన్‌మాఫియా డాన్, అతడి అనుచరుల అదుపులోనే ఉన్నాయని తెలుస్తోంది. షాపునకు బియ్యం రాకుండా నేరుగా తరలించుకుపోతున్నారంటే మాఫియా నెట్‌వర్క్ ఎంతబలంగా ఉందో గమనించవచ్చు. మూడు షాపుల్లో ఒక షాపునకు సరుకు రవాణా చేయకుండా అధికారులు వదిలేస్తారు. ఆ షాపులో మిగిలిన రెండు షాపుల నుంచి బియ్యం సర్దుబాటు చేసి లెక్కలు చూపిస్తారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజన్, మండలస్థాయి అధికారులతో మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ళనిర్మాణాలు పూర్తికి, స్టేజ్ కన్జర్వేషన్‌కు నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 2.0 ఇళ్ళ నిర్మాణాలకు లబ్ధిదారులను గుర్తించేందుకు ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సర్వే నిర్వహించాలన్నారు. పీఎం అవాస్‌యోజన గ్రామీణ 1.0లో మంజురై ఇప్పటికి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్నవాటిపై నిర్దేశిత ఫార్మేట్‌లో నవంబరు 15నాటికి ని వేదిక అందించాలన్నారు. పల్లెపండుగలో శంకుస్థాపన చేసిన సీసీ రోడ్లు పనులు నూరుశాతం ప్రారంభించేలా ఎంపీడీవోలు చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మం చినీరు, మురుగుదొడ్ల నిర్మాణపనులను నవంబరు 14 నాటికి పూర్తిచేయాలన్నారు. విద్యార్థు లకు ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రేషన్(అపార్) ఐడీ క్రియేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు, సీపీవో శేషశ్రీ, సమగ్రశిక్ష ఏపీసీ విజయలక్ష్మి, జిల్లా అధికారులు జయలక్ష్మి, ప్రసాద్, వజ్రశ్రీ, నున్న వెంకటేశ్వర్లు, వీరాచారి, సువార్త, రేణుక, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విద్యుదాఘాతానికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. విద్యుత్ శాఖ వర్గాల సమాచారం మేరకు నగరంలోని గోరంట్ల (డి7) సెక్షన్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి చెన్నం అరుణ్‌కుమార్ ఫీజ్ ఆఫ్ కాల్ విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 17వ తేదీన ఓ ఫిర్యాదు రావటంతో అరుణ్‌కుమార్ 11కేవీ విద్యుత్ పోల్ ఎక్కటంతో ప్రమాదానికి గురయ్యాడు. గాయాలతో ఉన్న అరుణ్‌కుమార్ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఏటి అగ్రహారం మాన్యం ప్రాంతానికి చెందిన అరుణ్‌కుమార్ దాదాపు దశాబ్ద కాలంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. అరుణ్‌కుమార్ మృతిపై విచారణ కానీ, కనీసం ఆ శాఖ అధికారులు పరామర్శకు కూడా రాలేదని సహచర ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని సహచర సిబ్బంది కోరుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 50,944 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 44,274 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుండగా 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా విడుదల అవుతున్నాయి.

41,651 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 43,346 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,651 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 30,279 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16000	334	8000	14500
నెంబరు. 5	8500	13000	నెంబరు. 5	--	--
273	10000	16000	273	12000	12500
341	9000	15000	341	10000	15700
4884	10000	11500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	18200	తేజ	10500	18500
బ్యాడిగి	8500	14000	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	8500	13500	దేవనూరు డీలక్స్	9000	13500
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	5000	11000

సింగపూర్ వెళ్లాలి బెయిల్ షరతులు సడలించండి

- పాస్‌పోర్టు కూడా తిరిగి ఇప్పించండి
- హైకోర్టులో వైసీపీ నేత పిన్నెల్లి పిటిషన్
- ఆయనకు నేర చరిత్ర ఉంది.. పారిపోతారు
- విచారణలో బెయిల్ రద్దు పిటిషన్: పోలీసులు
- 4న నిర్ణయం వెల్లడిస్తామన్న న్యాయమూర్తి

అమరావతి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నమోదైన కేసుల్లో బెయిల్ మంజూరు సందర్భంగా విధించిన షరతులను సడలించాలని కోరుతూ మాచర్ల మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తన కుమారుడు చదువు నిమిత్తం సింగపూర్‌కు వెళ్తున్నాడని, ఈ నేపథ్యంలో తండ్రిగా ఆయన వెంట వెళ్లి, ఆ దేశంలో ఏర్పాట్లు చేయాల్సి ఉందని వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్‌లలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తాను సింగపూర్‌కు వెళ్లేందుకు అనుమతించాలని విన్నవించారు. ఈ పిటిషన్‌కు సంబంధించి ఇటు పిన్నెల్లి, అటు పోలీసుల తరఫున వాదనలు మంగళవారం ముగియడంతో న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ నవంబరు 4న నిర్ణయం వెల్లడిస్తామని ప్రకటించారు.

పిన్నెల్లి వాదనలు ఇవీ..

ఎన్నికల సందర్భంగా సృష్టించిన విధ్వంసాలకు సంబంధించి తనపై నమోదైన కేసులలో హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిందని పిన్నెల్లి తరఫు న్యాయవాది రామలక్ష్మణరెడ్డి కోర్టుకు తెలిపారు. అయితే, ఇప్పుడు పిటిషనర్ తన కుమారుడి కోసం సింగపూర్ వెళ్లాల్సి ఉన్నందున ఈ షరతులలో రెండింటిని సడలించాలని విన్నవించారు. సింగపూర్ వెళ్లేందుకు వీలుగా మేజిస్ట్రేట్ వద్ద సరెండర్ చేసిన పాస్‌పోర్టును తిరిగి ఇప్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కోర్టు ఆదేశాల మేరకు ప్రతివారం దర్యాప్తు అధికారి ముందు హాజరవుతున్నట్టు తెలిపారు. ఈ షరతును కూడా సడలించాలని కోరారు. దర్యాప్తు అధికారి కోరినప్పుడు విచారణకు హాజరయ్యేందుకు పిటిషనర్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

సడలించొద్దు: పోలీసులు

పోలీసుల తరఫు న్యాయవాది స్పందిస్తూ.. "పిటిషనర్ (పిన్నెల్లి)కు నేరచరిత్ర ఉంది. ఇవే కేసుల్లో నిందితుడిగా ఉన్న పిటిషనర్ సోదరుడు(వెంకట్రామిరెడ్డి) విదేశాలకు పారిపోయారు. నోటీసు ఇచ్చేందుకు కూడా అందుబాటులో లేరు. పిన్నెల్లి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ ప్రాసిక్యూషన్ హైకోర్టులో పిటిషన్ వేసింది. ప్రస్తుతం దానిపై విచారణ పెండింగ్‌లో ఉంది. సోదరుడి వద్దకు వెళ్లేందుకే పిటిషనర్ పాసుపోర్ట్ ఇప్పించాలని కోరుతున్నారు. దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలని విధించిన షరతు సడలించవద్దు" అని కోర్టుకు విన్నవించారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. విదేశాలకు వెళ్లేందుకు ట్రయల్ కోర్టు అనుమతించాల్సి ఉంటుందన్నారు. దీనికి సంబంధించి నిర్ణీత సమయంలో నిర్ణయం తీసుకోవాలని విచారణ కోర్టుకు తగిన ఆదేశాలు ఇస్తామని తెలిపారు.

అసలు ఏం జరిగింది?

ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మాచర్ల నియోజకవర్గంలోని పాల్వాయిగేటు పోలింగ్ బూత్‌లో వైసీపీ అభ్యర్థి, అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విధ్వంసం సృష్టించారు. పోలింగ్ కేంద్రంలో ఈవీఎం, వీవీప్యాట్‌లను ధ్వంసం చేశారు. దీనిని అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడి చేశారు. కేంద్రం నుంచి బయటకు వస్తూ.. నాగశిరోమణి అనే మహిళను దూషించారు. ఈ ఘటనలకు సంబంధించి ఎన్నికల సంఘం ఆదేశాలతో పల్నాడుజిల్లా రెంటచింతల పోలీసులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మరో 15 మంది ఆయన అనుచరులపై హత్యాయత్నం(ఐపీసీ 307) మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మరుసటి రోజు మే14న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి, వీరి అనుచరులు కారంపూడిలో దాడులకు పాల్పడ్డారు. ఈ దాడులను అడ్డుకోబోయిన అప్పటి సీఐ నారాయణస్వామిపై దాడి చేసి గాయపరిచారు. సీఐ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కొన్నాళ్లు రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనకు హైకోర్టు అప్పట్లో షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇక, ఈ కేసులలో నిందితుడిగా ఉన్న పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పరారీలో ఉన్నారు.

పంచారామాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పంచారామాల దర్శనం కోసం ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజారవాణాధికారి ఎమ్.రవికాంత్ తెలిపారు. గుంటూరు-1 డిపో ట్రాఫిక్ విభాగంలో మంగళవారం జరిగిన సమావేశంలో డిపో మేనేజర్ ఎమ్‌వీఎస్ రామకృష్ణతో కలిసి బస్సులు బయల్దేరు వివరాలు, ఛార్జీలతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ శని, ఆదివారం రాత్రి బయల్దేరి తిరిగి మరుసటి రోజు రాత్రి సమయానికి గుంటూరు చేరుకునేలా సర్వీసులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచారామాలైన సామర్లకోట, అమరావతి, పాలకొల్లు, ద్రాక్షారామం, భీమవరంతో పాటు త్రిశైవ క్షేత్రాలైన యాగంటి, మహానంది, శ్రీశైలం క్షేత్రాలను దర్శించుకునేలా బస్సులను సిద్ధం చేశామన్నారు. రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించినట్లు తెలిపారు. ఆఫీస్ సూపరింటెండెంట్ వి.బాలునాయక్, ట్రాఫిక్ ఇన్‌ఛార్జి డీజీ నాయక్ తదితరులున్నారు.

వర్సిటీ దూర విద్యలో ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రాం



అనుమతి పత్రాలను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు, దూరవిద్య డైరెక్టర్ వెంకటేశ్వర్లు

పెదకాకాని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ 2024-25 విద్యా సంవత్సరానికి దూర విద్యా విధానంలో మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు దూర విద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మంగళవారం వెల్లడించారు. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ), డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) నుంచి నూతనంగా అనుమతి లభించినట్లు చెప్పారు. ఏపీ ఐసెట్-2024 లేదా ఏఎన్‌యూ, సీడీఈ నిర్వహించే టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు అన్నారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల వ్యవధి రెండేళ్లు ఉంటుందని, మొత్తం నాలుగు సెమిస్టర్లు ఉంటాయని చెప్పారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు త్వరలో నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. నవంబరు 15వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని ఆచార్య వెంకటేశ్వర్లు వివరించారు. ఈ సందర్భంగా డెబ్‌కు వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూర విద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఫైనాన్స్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, దూర విద్య కేంద్రం సూపరింటెండెంట్ నేలపాటి నాగేశ్వరరావు, వై.రాధాకృష్ణ, అకడమిక్ కౌన్సిలర్ డాక్టర్ వి.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నలుగురిలో ఒకరికి పక్షవాతం ముప్పు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ కుమారవేలు

గుంటూరు మెడికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ అంచనాల ప్రకారం ప్రతి నలుగురిలో ఒకరు జీవిత కాలంలో పక్షవాతం బారినపడే ప్రమాదం ఉందని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎస్.కుమారవేలు తెలిపారు. వరల్డ్ స్ట్రోక్ డే పురస్కరించుకొని మంగళవారం రమేష్ హాస్పిటల్స్‌లో జరిగిన పక్షవాతం అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. పక్షవాతం వచ్చిన మొదటి నాలుగు గంటల్లో రోగిని ఆస్పత్రికి తెస్తే వ్యాధిని నయం చేయవచ్చన్నారు. బీపీ, సుగర్, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవడం, ధూమపానం, మద్యపానం మానివేయడం సరైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం వంటివి పాటిస్తే పక్షవాతం నుంచి రక్షణ లభిస్తుందని డాక్టర్ కుమారవేలు తెలిపారు. ఈ సందర్భంగా 70 ఏళ్ల పైబడి నిరంతరం వ్యాయామం, సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవిస్తున్న సీనియర్ సిటిజన్లు ఎ.శ్రీనివాసమూర్తి, వి.దివాకర్, మహమ్మద్ షహదుల్ల, జి.వెంకటేశ్వరరావు, నీలాంబరంను ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సన్మానించారు. వీరి స్ఫూర్తితో యువత పక్షవాతం బారిన పడకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత తెలిపారు. కార్యక్రమంలో బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి, న్యూరాలజిస్ట్ డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రమణ యశస్వి



డాక్టర్ రమణ యశస్విని అభినందిస్తున్న ఉద్యోగులు

గుంటూరు మెడికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రమణ యశస్వి మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ యేకుల కిరణ్ కుమార్ నుంచి ఆయన సూపరింటెండెంట్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, నర్సులు, మినిస్టీరియల్, ఫోర్త్‌క్లాస్ ఉద్యోగులు నూతన సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వికి అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జీజీహెచ్ బ్రాంచ్ శాఖ ప్రధాన కార్యదర్శి వడ్డె బాలయ్య ఆధ్వర్యంలో తమ పెండింగ్ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఫోర్త్‌క్లాస్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. జనసేన జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి డాక్టర్ రమణ యశస్విని అభినందించారు.

ఆత్మస్థైర్యంతో విజయాలను అందుకోవాలి



ఎస్ఆర్ఎం విద్యార్థులను అభినందిస్తున్న హోంమంత్రి అనిత

మంగళగిరి, అక్టోబరు 29: విద్యార్థులు అన్ని సందర్భాల్లో ఆత్మస్థైర్యంతో ఉండాలని, అప్పుడే విజయాలను సాధించడం సాధ్యమవుతుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఎవరెస్ట్ బేస్ క్యాంపు అధిరోహణను పూర్తి చేసుకుని విజయవంతంగా తిరిగివచ్చిన ఏపీ ఎస్ఆర్ఎం విద్యార్థులు, ప్రొఫెసర్లు మంగళవారం విజయవాడ వెళ్లి హోంమంత్రి అనితను కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులను అభినందిస్తూ కేవలం చదువులకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడ పాల్గొనాలని చెప్పారు. ఎవరెస్ట్ శిఖరాలను అధిరోహించడం వంటి వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఎస్ఆర్ఎం యాజమాన్యాన్ని మంత్రి ప్రశంసించారు. యాత్రలో పాల్గొన్న మహిళా విద్యార్థినుల అనుభవాలను ఆమె ఈ సందర్భంగా అడిగి తెలుసుకున్నారు. తొలుత ఉదయం యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించిన అభినందన సభలో వర్సిటీ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్, డీన్ డాక్టర్ భరద్వాజ్‌తోపాటు పలువురు డైరెక్టర్లు యాత్రలో పాల్గొన్న విద్యార్థుల ధైర్య సాహసాలను ప్రశంసించారు.

దోషికి శిక్ష పడాలన్నదే లక్ష్యం

● డీడీ ఎండీ బర్కత్ అలీ ఖాన్





గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నేరం చేసిన వ్యక్తి ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోరాదు. దోషికి శిక్ష పడాలి. నిరపరాధిపై తప్పుడు అభియోగాలు వీగిపోవాలి. ఇదే లక్ష్యంతో విధులు నిర్వహిస్తున్నామని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఎండీ బర్కత్ అలీ ఖాన్ తెలిపారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు ప్రాసిక్యూషన్ డీడీగా వ్యవహరిస్తున్న ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

నేరస్తులు తప్పించుకోకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

డీడీ: చట్టాలపై దర్యాప్తు అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండటం లేదు. దీనివలన ఇన్వెస్టిగేషన్ సరిగా చేయలేక ప్రాసిక్యూషన్ సమయంలో నేరాభియోగాలను నిరూపించలేకపోతున్నారు. ఇందుకు తమ శాఖ పరంగా చట్టాలపై అవగాహన కలిగిస్తూ ఇన్వెస్టిగేషన్ అధికారులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

కొత్త చట్టాలపై అవగాహన పరిస్థితి ఏమిటి?

డీడీ: ఇన్వెస్టిగేషన్ అధికారులకు శిక్షణ శిబిరాల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాం. మూడు జిల్లాల్లోని అధికారులకు విడతల వారీగా శిక్షణ ఇచ్చి 2024 జూలై ఒకటో తేదీ తర్వాత జరిగిన నేరాలపై కొత్త చట్టాలు, అంతకుముందు జరిగిన వాటిపై పాత చట్టాలతో దర్యాప్తు జరిపేలా చర్యలు తీసుకోమని చెబుతాం.

సలహాల కోసం ఎవరెవరు వస్తుంటారు?

డీడీ: మూడు జిల్లాల పోలీసు అధికారులే కాకుండా జిల్లాల కలెక్టర్లు కూడా వారి సిబ్బందిని పంపిస్తుంటారు. ఇటీవలే గుంటూరు జిల్లా కలెక్టర్ ఒక లోకాయుక్తా కేసుకు సంబంధించి న్యాయసలహా కోసం సంబంధిత అధికారిని పంపిస్తే గైడ్ చేశారు.

కోర్టుల్లో కేసులు వీగిపోవడానికి కారణం ఏమిటి?

డీడీ: ఇన్వెస్టిగేషన్ అధికారి, ప్రాసిక్యూషన్‌కు మధ్యన సమన్వయం లోపించింది. దీనివలన కేసుని సరిగా బిల్డ్ చేయలేకపోతున్నారు. ఇది కూడా నేర నిరూపణ కాకపోవడానికి ఒక కారణం. వృత్తిపరంగా లోపాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. చట్టం ఎలా ఉందో దాని ప్రకారమే అమలు జరగాలి. ఇన్వెస్టిగేషన్ సరైన దిశగా కొనసాగితేనే కేసులో బలం ఉంటుందని చెప్పి అందుకు ఎక్కడెక్కడ లోపాలు జరుగుతున్నాయో వారికి వివరించి సరిదిద్దుకోమని చెబుతున్నాం.

పసికందు విక్రయం కేసులో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వినోద్ కుమార్

మంగళగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): హాస్పిటల్‌లో పని చేస్తూ పుట్టిన పసికందులను దొంగిలించి మాయమాటలు చెప్పి విక్రయిస్తున్న ఓ జంటను మంగళగిరి పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి వద్ద 15 రోజుల పసికందును గుర్తించగా సదరు బాబును రూ.5లక్షలకు విక్రయించేందుకు ప్రయత్నించినట్టుగా పోలీసులు గుర్తించారు. మంగళగిరి పట్టణ సీఐ వినోద్‌కుమార్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విజయవాడ వాగు సెంటర్ జోడు బొమ్మల సెంటర్‌కు చెందిన బొమ్మిడి ఉమాదేవి, త్రినాథ్ దంపతులను మంగళవారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్లు తెలిపారు. పసికందు ఎవరు, వారి తల్లిదండ్రులు ఎవరు, దీని వెనుక ఎవరు ఉన్నారన్న విషయం విచారణలో తేలనుందన్నారు. అయితే హైదరాబాద్‌కు చెందిన కీలక నిందితులైన మరో జంట కోసం గాలిస్తున్నామని, వారు దొరికితే కేసు చిక్కుముడి వీడే అవకాశం ఉందని సీఐ చెప్పారు.

ఆస్తి కోసం తండ్రిని కడతేర్చిన కుమారుడు

● మద్యం మత్తులో మంచం కోడుతో దాడి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు

ప్రత్తిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తండ్రితో గొడవపడి.. ఆపై మంచం కోడుతో కొట్టి తండ్రిని చంపిన సంఘటన మండల పరిధిలోని చిన కోండ్రుపాడులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చినకోండ్రుపాడు పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేసే తోకల వెంకట్రామయ్య (62)కు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మొదటి భార్య కుమారుడు వెంకట కృష్ణ వివాహం జరిగిన నాటి నుంచి పొన్నూరు మండలం కొండబలివారిపాలెంలో నివాసం ఉంటున్నాడు. రెండో భార్యకు పిల్లలు లేరు. అయితే కొంతకాలంగా వెంకటకృష్ణ ఆస్తి కోసం చినకోండ్రుపాడు వచ్చి తండ్రితో తరచూ గొడవ పడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఫుల్‌గా మద్యం తాగిన వెంకట కృష్ణ తండ్రి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో తండ్రి ఇంట్లో లేకపోవడంతో ఇంటి తాళాలు పగలగొట్టి లోపలకు వెళ్లాడు. ఆ తరువాత ఇంటికి వచ్చిన తండ్రి వెంకట్రామయ్యతో గొడవ పడ్డాడు.మంచం కోడుతో తలపై బలంగా కొట్టాడు. తలకు బలమైన దెబ్బ తగలడంతో బాగా రక్తం పోయింది. వెంటనే ఆయన్ను కేఎంసీ వైద్యశాలకు తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు చెప్పారు. సంఘటనా స్థలాన్ని ప్రత్తిపాడు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ నాగేంద్ర పరిశీలించారు. వెంకటకృష్ణను అదుపులోకి తీసుకున్నారు.

ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

ప్రధాన కార్యాలయము : 3/2 బ్రాడీపేట, గుంటూరు-522002.
మంగళగిరి బ్రాంచి, గుంటూరు జిల్లా

స్థిరాస్తి స్వాధీనపు ప్రకటన

(Appendix-IV) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) చట్టం 2002, రూల్ 8(1) ప్రకారము

లోన్ నెం: 001130071000147

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ - 2002, ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్, మంగళగిరి బ్రాంచి వారి అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 యొక్క రూల్ 3 లో చదువుకోవలసిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ ఋణగ్రహీత అయిన శ్రీ కూరపాటి ఆదం, తండ్రి: కూరపాటి వీరయ్య, మరియు కో-ఆబ్లిగెంట్: శ్రీమతి కూరపాటి సమాధానం, భర్త: కూరపాటి ఆదం, చిరునామా : డి.నెం. 2-76, కరకట్ట రోడ్డు, అంబేద్కర్ బొమ్మ సెంటర్, చిర్రావూరు, తాడేపల్లి, పిన్-522303 గార్లను సదరు నోటీసులు అందిన తేదీ నుండి 60 రోజుల లోపు నోటీసులలో పేర్కొనబడిన మొత్తమును మరియు వాటిపై వడ్డీ చెల్లించవలసిందిగా ది.10-01-2024న డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.

పైన పేర్కొనబడిన ఋణగ్రహీతలు/ హామీదారులు/ కో- ఆబ్లిగెంట్లు / తనఖాదారులు సొమ్మును సదరు సమయము లోపుగా తిరిగి చెల్లించటంలో విఫలమైనందున, ఋణగ్రహీతలు, హామీదారులు, కో-ఆబ్లిగెంట్, తనఖాదారులు మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందు మూలముగా ప్రకటించునది ఏమనగా సదరు నిబంధన లోని రూలు 8(1) తో చదువుకోవలసిన సదరు చట్టం నందలి సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు ది.24-10-2024న ఆస్తులను స్వాధీనము (సింబాలిక్) చేసుకున్నారు.

ముఖ్యంగా ఋణగ్రహీతలు/ కో- ఆబ్లిగెంట్లు/ హామీదారులు/ తనఖాదారులు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తులతో ఎవరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తులకు సంబంధించిన ఏవిధమైన లావాదేవీలైన బ్యాంకు వారి బకాయి మొత్తముకు మరియు వాటిపై వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్, మంగళగిరి బ్రాంచి వారి చార్జికి లోబడి ఉంటాయి.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ - 2002, సెక్షన్ 13(8) యొక్క నిబంధన ప్రకారం ఋణగ్రహీతలు/ కో- ఆబ్లిగెంట్లు/ హామీదారులు/ తనఖాదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి వున్న కాల వ్యవధిని వినియోగించుటకై శ్రద్ధ వహించవలెను.

1) డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తము లోను 001130071000147కు 31-12-2023 నాటికి రూ.5,06,354/- (అక్షరాలా ఐదు లక్షల ఆరు వేల మూడు వందల యాభై నాలుగు రూపాయలు మాత్రము) మరియు ది.01-01-2024 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

2) ప్రస్తుత బకాయి మొత్తము లోను 001130071000147కు 30-09-2024 నాటికి రూ.5,31,789/- (అక్షరాలా ఐదు లక్షల ముప్పైఒక్క వేల ఏడు వందల ఎనభైతొమ్మిది రూపాయలు మాత్రము) మరియు ది.01-10-2024 నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.

3) ఆస్తులను స్వాధీనము (సింబాలిక్) చేసుకొన్న తేది : 24-10-2024.

స్థిరాస్తి వివరములు :

గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ జిల్లా, మంగళగిరి మండలం, రామచంద్రాపురం గ్రామ పంచాయతి ఏరియాలో చేరిన రామచంద్రాపురం గ్రామ డి.నెం.70 రు, 1వ బ్లాక్, డోర్ నెం.1-201 ప్రక్కన గల ఇంటికి హద్దులు: తూర్పు: కొండా సత్యంగారి ఆస్తి హద్దు-32.0 అ॥లు, దక్షిణం: పోకల పాములు గారి ఆస్తి హద్దు-72.0 అ॥లు, పడమర: పంచాయతి బజారు హద్దు-32.75అ॥లు, ఉత్తరం: దేవరపల్లి నరసమ్మ గారి ఆస్తి హద్దు-72.0 అ॥లు. ఈ హద్దుల మధ్య చ॥గ॥ 257 లు లేక 214.85 చ॥మీటర్ల నివేశిత ఇంటికి సంబంధించిన యావత్తు ఆస్తి.

తేది : 30-10-2024 సం/- అధీకృత అధికారి
స్థలం : మంగళగిరి ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి., మంగళగిరి బ్రాంచి, గుంటూరు జిల్లా.



ఉద్యోగావకాశాలు

➡ టాటా పవర్ హోమ్ సోలార్ సిస్టమ్స్ సేల్స్ ప్రమోషన్ కొరకు P/T, F/T మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టెలికాలర్స్, టెక్నికల్ & బిజినెస్ అసోసియేట్స్, ఏజెంట్స్ కావలెను. ఆకర్షణీయమైన ఆదాయం. సంప్ర॥ 9392227337.
MA-206

➡ తెనాలిలోని ప్రముఖ స్కూలు నందు మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీష్, సోషల్ సబ్జెక్టులలో బోధించుటకు 6th to 9th క్లాస్ వరకు టీచర్స్ కావలెను. సెల్ : 9247283428.
AJG-203563

అమ్మకము

➡ గుంటూరు సిటీలోని ఇన్నర్ రింగ్ రోడ్డులో YSR బొమ్మ దగ్గర 3000 Sq.f తో అన్ని వసతులతో అపార్ట్‌మెంట్‌లో డూప్లెక్స్ ఫ్లాట్ అమ్మకానికి కలదు. సంప్ర॥ 9394113848.
AJG-203525

మ్యారేజ్ బ్యూరో

➡ సమీరా ముస్లిం మ్యారేజ్ బ్యూరో అన్ని రకముల ముస్లిం మ్యారేజెస్ చూడబడును. సంప్ర॥ Cell : 9492154146, mail : sjohnbasha13@gmail.com
AJG-191895

వాహనాల అమ్మకము

➡ AP - 26 - AY - 1279 TOYOTA INNOVA 2.5 V Model 2017 వాహనము 02-11-2024 న ఉదయం 10.30 ని.లకు అమ్మబడును. వివరములకు అరుణా ఫైనాన్స్ లిమిటెడ్ 98666 51531, 88851 22300
AJB-882

EDUCATION

➡ B.Tech/Degree/Diploma ఇప్పుడు మీరు మీ డిగ్రీని ఆమోదిత విశ్వవిద్యాలయాలలో క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ విధనంలో పూర్తి చేయవచ్చును. ఆమోదిత సంస్థ - ప్రభుత్వ ఉద్యోగాలకు వర్తించును. సం॥ప్ర॥ 8330964279.
AJW-199039

CHANGE OF NAME

➡ I, SYED MOINUDDIN S/o. SYED AJEEJULLA, R/o. D.No.14-87, Big Maseedu Center, Namburu Post, Pedakakani Mandal, Guntur District - 522508, A.P., India. I have changed my name from SYED MOINUDDEN to SYED MOINUDDIN and my Date of Birth from 30-07-1988 to 30-07- 1989. Henceforth I am being called as SYED MOINUDDIN S/o. SYED AJEEJULLA & my correct Date of Birth is 30-07-1989 for all purposes
AJG-203533

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

గుంటూరు 1 టౌన్	97036 18725
గుంటూరు 2 టౌన్	99854 01056
తెనాలి	99854 11202
నరసరావుపేట	99854 11206
బాపట్ల	99663 35084
పిడుగురాళ్ళ	93909 05725
మంగళగిరి	93986 73618
అమరావతి	95027 86195
పొన్నూరు	97042 99094
రేపల్లె	99854 12254
చిలకలూరిపేట	98852 71281
వినుకొండ	99662 50266
మాచర్ల	88861 19952
సత్తెనపల్లి	91103 23914
ప్రత్తిపాడు	63004 34285

సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11214

ఇట్లు : బ్రాంచ్ మేనేజర్



గుంటూరు : పల్లవి డీలక్స్	ఒంగోలు : సాయిసరోజ కుమారి
గుంటూరు : శివ డీలక్స్	తెనాలి : మిని సంగమేశ్వర
గుంటూరు : వి. ప్లాటినో	నరసరావుపేట : ఈశ్వర్‌మహల్
గుంటూరు : PVR (D. Mat)	చీరాల : మోహన్ థియేటర్
గుంటూరు : ఫోనిక్స్ మాల్ (మైత్రీ)	మంగళగిరి : విజయడీలక్స్
గుంటూరు : జెఎల్ఈ సినిమాస్	సత్తెనపల్లి : ఈశ్వరసాయి థియేటర్
ఒంగోలు : గోపి	వినుకొండ : సురేష్‌మహల్

గుంటూరు జిల్లా : నిఖిలేష్ ఆర్ట్ ప్రొడక్షన్ రిలీజ్ సెల్ : 94405 89723

దీపావళి శుభాకాంక్షలతో..
రేపే విడుదల

గుంటూరు : కీర్తన థియేటర్
గుంటూరు : నాజ్ అప్సర థియేటర్
గుంటూరు : హరిహరమహల్
గుంటూరు : వి. ప్లాటినో
గుంటూరు : ఫోనిక్స్‌మాల్ (మైత్రీ)
గుంటూరు : ది సినిమాస్
ఒంగోలు : గోరంట్ల సినిమాస్
ఒంగోలు : రవి ప్రియమాల్
తెనాలి : సంగమేశ్వర
నరసరావుపేట : లక్ష్మీ నరసింహాడీలక్స్
చిలకలూరిపేట : కె. ఆర్. మిని
చీరాల : సురేష్‌మహల్
బాపట్ల : విజయకృష్ణ థియేటర్
పిడుగురాళ్ళ : జయలక్ష్మి
పొన్నూరు : శ్రీలక్ష్మీ థియేటర్
రేపల్లె : రాజ్యలక్ష్మి థియేటర్
మాచర్ల : వెంకటేశ్వర థియేటర్
మంగళగిరి : అన్నపూర్ణ థియేటర్
సత్తెనపల్లి : శ్రీనివాస థియేటర్
వినుకొండ : అరుణ పి. ప్యాలెస్
అద్దంకి : మిని VNS థియేటర్
టంగుటూరు : వెంకటేశ్వర థియేటర్



నేడు డయల్ యువర్ డీపీటీవో

గుంటూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆర్టీసీ పరమైన సమస్యలు, ఫిర్యాదుల కోసం బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీపీటీవో కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.రవికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలు, ఫిర్యాదుల కోసం 9959225412కు ఫోన్‌కు సంప్రదించాలని కోరారు.

దీపావళి షాపుల ఏర్పాటుకు 290 దరఖాస్తులు

గుంటూరు సిటీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో దీపావళి మందుల షాపులు ఏర్పాటు చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ఈసారి దీపావళి మందుల షాపులు ఏర్పాటు చేసేందుకు అవసరమైన నిరభ్యంతర సర్టిఫికెట్ కోసం 290 మంది దరఖాస్తు చేసుకున్నట్లు జిల్లా అగ్నిమాపక అధికారి ముక్కు శ్రీనివాసరెడ్డి తెలిపారు. లైసెన్స్ పొందిన వాళ్లు షాపు ఏర్పాటు, అమ్మకాల విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

టీటీడీ జేఈవో వెంకన్న చౌదరిపై విమర్శలు అర్థరహితం

గుంటూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టీటీడీ జేఈవో వెంకన్న చౌదరిపై శ్రీనివాసానంద స్వామిజీ చేసిన విమర్శలు అర్థరహితమని టీడీపీ నాయకుడు పాటిబండ్ల విజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర సర్వీసులు నుంచి వచ్చి నీతి, నిజాయితీగా ఉన్న వ్యక్తి వెంకన్న చౌదరి అని, ఆయనపై విమర్శలు చేయటం స్వామిజీ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం టీటీడీని అపవిత్రం చేసిందని గుర్తు చేశారు, వైఎస్ జగన్ తిరుమలకు 11 సార్లు వెళ్లాడని, ఏరోజు కూడా సతీమణితో వెళ్లకుండా హిందూ మతాన్ని అపహాస్యం చేయడం వలనే 11 సీట్లకు భగవంతుడు పరిమితం చేశాడని మండిపడ్డారు. శ్రీనివాసానంద స్వామీజీ కువిమర్శలకు దిగటం సరికాదన్నారు.

అరణ్యపర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం శ్రీమాన్ గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామిచే మహాభారతం - అరణ్య పర్వంపై ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీ కూర్మనాథ స్వామి వారు ప్రవచిస్తూ అరణ్యపర్వంలో ధర్మరాజాదులు కామ్యక వనం నుంచి ద్వైతవనంలో ప్రవేశించే అంశాలను వివరంగా తమ ప్రవచనం ద్వారా భక్తులకు అందజేశారు.

ఆయుర్వేద వైద్యానికి ప్రజల్లో అనూహ్య ఆదరణ

● డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు వెల్లడి



శిబిరంలో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక యుగంలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు, ఆధునిక వైద్యసేవలపై ఆదరణ పెరిగినా అదే సమయంలో ప్రాచీన వైద్యమైన ఆయుర్వేద వైద్యసేవలకు అనూహ్య ఆదరణ లభిస్తోందని ఆయుర్వేద, కేరళ పంచకర్మ వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయుర్వేద వైద్యానికి మూలపురుషుడైన భగవాన్ ధన్వంతరీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఎంజీ ఇన్నర్ రింగ్ రోడ్‌లో భాష్యం రామసేతు వెనుక గల శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. మానవ శరీరం స్థూలంగా వాతా, పిత్త, కఫ అనే దోషాలతో నిర్మితమై ఉంటుందని ఆయన వివరించారు. ఈ దోషాలతో వచ్చే హెచ్చు తగ్గులను సరి చేయడానికి, పేరుకుపోయిన మలినాలను బయటకు పంపించి శుద్ధి చేయడానికి పంచకర్మలు ఉపయోగపడతాయని ఆయన వివరించారు. కేరళ పంచకర్మ చికిత్సలైన అభ్యంగము, కలరి, స్టీమ్‌బాత్, ఎలక్కిడి, పడొక్కిడి, నవరక్కిడి, శిరోధార, తలపోతిచ్చిల్, పిడిచ్చిల్ తదితర పంచకర్మ చికిత్సల ద్వారా పలు రకాల దీర్ఘకాలిక వ్యాధులను నయం చేయవచ్చని డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు వెల్లడించారు.

వీధి వ్యాపారులకు 'వెలుగులు'

● ఫోన్ చేస్తే చాలు అద్దెకు ఎల్ఈడీ బల్బులు

● చిరువ్యాపారులకు వెలుగులు నింపుతోన్న లైట్లు



ఎల్ఈడీ లైట్ల వెలుగులో వ్యాపారం

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడ తోపుడు బండ్లపై వ్యాపారం జరుపుకునే వీధి వ్యాపారులకు ఓ'వరం'లా ఎల్ఈడీ లైట్లు వెలుగులు నింపుతున్నాయి. ఫోన్ చేస్తే చాలు సాయంత్రానికి తమ బండి వద్దకే ఎల్ఈడీ లైట్లు అద్దెకు తీసుకొచ్చి ఇచ్చేలా మరికొందరు వ్యాపారులు ప్రత్యేక వ్యాపారమే చేస్తున్నారు. ఇలా ఎల్ఈడీ లైట్లను సొంతంగా కొనుగోలు చేయలేని చిరువ్యాపారులకు లైట్లు అద్దెకు ఇవ్వటం ఓ వరంలా మారుతోంది. ఇలా నగరంలో అనేక ప్రాంతాల్లో విస్తరించిన ఈ వ్యాపారంపై ప్రత్యేక కథనం.... కూరగాయలు, పండ్లు, పూలు ఇలా అనేక మంది వీధి వ్యాపారులు తోపుడు బండ్లపై పెట్టుకొని విక్రయిస్తుంటారు. వీధి వ్యాపారులకు సాయంత్రం అయిందంటే విద్యుత్ వెలుగులు లేక చీకట్లో అనేక ఇబ్బందులు పడుతుంటారు. గతంలో గ్యాస్, కిరోసిన్ స్టౌలు ఉండేవి. ఇప్పుడు వాటి స్థానంలో ఎల్ఈడీ లైట్లే వచ్చాయి. అయితే సొంతంగా ఎల్ఈడీ లైట్లు కొనుగోలు చేయాలంటే ఒకటి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు కంపెనీలను బట్టి విక్రయిస్తున్నారు. అంత భరాయించి రెండు, మూడు లైట్లు కొనుగోలు చేయాలంటేనే వామ్మో అనుకోవాల్సిన పరిస్థితి చిరువ్యాపారులది. అటువంటి పరిస్థితి లేకుండా కొందరు ఏకంగా 50 నుంచి 100 వరకు ఎల్ఈడీ లైట్లను సొంతంగా కొనుగోలు చేసి వీధి వ్యాపారులకు రోజువారీగా అద్దెలకు ఇచ్చేలా వ్యాపారం చేస్తున్నారు. ఒక్కో లైటు రోజుకు వచ్చేసి రూ.20 నుంచి రూ.30 వరకు ప్రాంతాలను బట్టి అద్దె వసూలు చేస్తోన్నారు. నిత్యం వారే ఎల్ఈడీ లైట్లకు పగలంతా విద్యుత్ ఛార్జింగ్ పెట్టి సాయంత్రం నాలుగైదు గంటల కల్లా చిరువ్యాపారులకు అందజేస్తున్నారు. మరలా తిరిగి రాత్రి 10 గంటల సమయానికల్లా వారే లైట్లను తీసుకెళుతున్నారు. ఇలా ఎల్ఈడీ లైట్లు అద్దెకు దొరుకుతుండటంతో వ్యాపారాలకు ఇబ్బంది లేకుండా పోతుందని చిరు వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు చిరువ్యాపారులకు గుర్తింపు కార్డులిచ్చి సొంతంగా తోపుడు బండ్లు, ఎల్ఈడీ లైట్లు కొనుగోలు చేసుకునేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరుతున్నారు.

ఎల్ఈడీ లైట్లు అద్దెకు తీసుకొని వ్యాపారం చేసుకుంటున్నా

● మట్టే వెంకటేశ్వర్లు, చిరు వ్యాపారి



ఎక్కడ వ్యాపారం బాగుంటే అక్కడ తోపుడు బండిపై వ్యాపారం చేసుకుంటుంటాం. గతంలో సాయంత్రం అయిందంటే చీకటితో ఇబ్బంది పడే వాళ్ళం. ప్రస్తుతం ఎల్ఈడీ లైట్లు రావటంతో వ్యాపారానికి ఇబ్బంది లేదు. ఫోన్ చేస్తే చాలు వారే వచ్చి లైట్లు అద్దెకు ఇస్తారు. ఒకదానికి రూ.20లు అద్దె తీసుకుంటారు. వారే ఛార్జింగ్ పెట్టి సాయంత్రానికి అందజేస్తారు. ఇది బాగానే ఉంది కానీ ప్రభుత్వాలు కూడా సొంతంగా తోపుడు బండి, ఎల్ఈడీ లైట్లు కొనుగోలు చేసుకునేలా రుణాలు మంజూరు చేస్తే వీధి వ్యాపారులకు మరింత మేలు చేసినట్లవుతుంది.

ఆలపాటిని అత్యధిక మెజారిటీతో గెలిపించండి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ కోరారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన అధ్యక్షతన తాడికొండ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఒక నియంతపై ఎన్ని ఒడిదుడుకులు ఎదుర్కొని గెలిచామో, అదే స్ఫూర్తితో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా గెలిచేలా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమంలో పాల్గొని ఓట్లు నమోదు చేయాలన్నారు. 2021 అక్టోబరు నాటికి డిగ్రీ పూర్తైనవారు మాత్రమే అర్హులని, వారిని గుర్తించి ఓటర్లుగా నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దామినేని శ్రీనివాసరావు, నూతలపాటి రామారావు, ధనేకుల వెంకట సుబ్బారావు, తలశిల ప్రసన్న కుమార్, మండవ నరసింహారావు, మల్లిపెద్ది రమేష్, అబ్దుల్ గని పాల్గొన్నారు.

● గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి ప్రభుత్వం బలపరిచిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను పట్టభద్రులు గెలిపించాలని మాజీ కార్పొరేటర్ మేడిద సత్యవతి కోరారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని 57వ డివిజన్ మంగళదాస్‌నగర్‌లో మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టభద్రులంతా అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేసే కూటమి ప్రభుత్వం అభ్యర్థి ఆలపాటిని గెలిపించి జంట నగరాల అభివృద్ధికి మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో షెడ్యూల్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడిద బాబురావు, టీడీపీ నాయకులు నల్లపనేని అమర్‌నాధ్, బురదగుంట కిరణ్, సువర్ణలాల్, ఏసుబాబు తదితరులున్నారు.

జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న కమిషనర్



మంత్రి నారాయణ చేతుల మీదగా అవార్డు అందుకుంటున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పీఎం స్వానిధి ద్వారా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 24,197 అప్లికేషన్‌లకు గాను బ్యాంక్‌ల ద్వారా 21,594 మంది చిరు వ్యాపారులకు రుణాలు అందించడం ద్వారా దేశంలో తొలి స్థానంలో నిలిచిన నగరపాలక సంస్థకు మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ అవార్డు, ప్రశంసా పత్రాన్ని నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకి అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధి వ్యాపారులకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందించి జాతీయ స్థాయిలో గుంటూరు నగరపాలక సంస్థకు ప్రత్యేక గుర్తింపు సాధించామని తెలిపారు.

పీకలవాగు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి : కమిషనర్

నగరపాలక సంస్థ పరిధిలోని పీకలవాగు వెంట కల్వర్టు, రైలింగ్ ఏర్పాటు చేయాలని, పీకలవాగు ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ మంగళవారం దేవాపురం, కోబాల్ట్ పేట ప్రాంతాల్లో పర్యటించి పీకలవాగు కల్వర్ట్, పారిశుధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. పర్యటనలో కార్పొరేటర్ బి.రాజలత, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ నాగభూషణం, ఏసీపీ రెహ్మాన్, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఆర్.ఓ. శివన్నారాయణ, స్పెషల్ శానిటేషన్ ప్రత్యేక అధికారి నిరంజన్, ఎస్.ఎస్. సోమశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అనధికారిక బోర్‌వెల్స్‌ను సీజ్ చేయండి

నగరపాలక సంస్థ పరిధిలో అనధికారికంగా నిర్వహిస్తూ, నీటి విక్రయాలు చేస్తున్న బోర్‌వెల్స్‌ని సీజ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు లేఖలు పంపామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల మేరకు అనధి కార బోర్స్ ద్వారా నీటిని విక్రయాలు చేస్తున్న ప్లాంట్‌లను సీజ్ చేయాలని, అటువంటి ప్లాంట్‌లకు విద్యుత్ కనెక్షన్ తొలగించాలని సీపీడీసీఎల్ ఎస్ఈకి తెలిపామన్నారు.



ప్రాంగణ ఎంపికలలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాలలో మంగళవారం ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ పాల్టెక్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో పలు విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొని, ఉద్యోగాలు పొందారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ కె.మద్దినేని జగదీష్‌లు మాట్లాడుతూ తమ కళాశాలలో పలు విభాగాలకు చెందిన 17 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.6 లక్షల వేతనం లభిస్తుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, కోశాధికారి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాదు అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎస్‌సీ విభాగంలో 9, సీఎస్‌డీలో 4, సీఎస్ఎంలో 3, సీఎస్‌బీఎస్‌లో ఒకటి మొత్తం 17 మంది విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎస్‌వీ శ్రీనివాస రావు, సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె. సురేష్ బాబు తదితరులు అభినందించారు.

ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను తనిఖీ చేసిన జేసీ

గుంటూరు సిటీ,అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మంగళవారం గుంటూరు కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ తనిఖీ చేశారు. అనంతరం ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామంలో వ్యవసాయ మార్కెట్‌లో వీవీపాట్స్ భద్రపరచిన గోడౌన్‌ను ఆయన పరిశీలించారు. సీసీ టీవీ పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. గోడౌన్ వద్ద భద్రత సిబ్బంది లాగ్ బుక్‌ను పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలపై ఎక్స్ పైరీ తారీఖును ఎప్పటికప్పుడు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్‌డీఓ కె.శ్రీనివాసరావు, గుంటూ రు పశ్చిమ మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఫిరంగిపురం తహసీల్దార్ జె.ప్రసాదరావు, గుంటూరు, ఫిరంగిపురం అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్లు కృష్ణారెడ్డి, షేక్ ఖాసీం, ఫిరంగిపురం ఆర్ అండ్ బి ఏఈ అరుణ్ కుమార్, ఎల క్షన్ సెక్షన్ పర్యవేక్షకులు ఇస్మాయిల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మనిషిని నిర్వీర్యం చేసే జబ్బు పక్షవాతం

● న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పక్షవాతం వ్యాధిని బ్రెయిన్‌స్ట్రోక్‌గా పిలుస్తారని, మనిషిని నిర్వీర్యం చేసే జబ్బుల్లో పక్షవాతం మొదటిస్థానంలో ఉంటుందని ప్రముఖ న్యూరాలజిస్ట్, ఇండియన్ స్ట్రోక్ కాంగ్రెస్ నేషనల్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ పీ.విజయ తెలిపారు. వరల్డ్ స్ట్రోక్ డే పురస్కరించుకొని మంగళవారం కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో పక్షవాతంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాశంకర్ అధ్యక్షతవహించారు. డాక్టర్ విజయ మాట్లాడుతూ ప్రతి నలుగురిలో ఒకరు జీవిత కాలంలో పక్షవాతం బారినపడే ప్రమాదం ఉందని తెలిపారు. కార్యక్రమంలో న్యూరో సర్జన్ డాక్టర్ కిరీటి, న్యూరో రేడియాలజిస్ట్ డాక్టర్ సంతోష్, న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ అజయ్ పక్షవాతం చికిత్సలు, జాగ్రత్తలపై వివరించారు.

● గుంటూరు(తూర్పు): గత ఐదు, పదేళ్లుగా పక్షవాతం బారిన పడే వారి సంఖ్య పెరిగిందని, యంత్రాల వినియోగం పెరగటం, శారీరక శ్రమ లేకపోవటం, ఎక్కువ సేపు కూర్చోవటం, జంక్‌ఫుడ్ వంటి ఆధునిక జీవన విధానమే కారణమని ప్రముఖ న్యూరాలజిస్టులు అన్నారు. ప్రపంచ పక్షవాత దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ గుంటూరు సహకారంతో ప్రజారోగ్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో పక్షవాతంపై అవగాహన సభ నిర్వహించారు. ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాదు, న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ గుంటూరు అధ్యక్షుడు డాక్టర్ వి.రమాతారక్‌నాథ్, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ సెక్రెటరీ డాక్టర్ పి.విజయ, న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ డాక్టర్ శివరామకృష్ణ, జీజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, న్యూరాలజిస్టులు నర్మద, నవీన్, నట్రాజ్, పి.బాలకృష్ణ, ప్రవీణ్, ఎన్.శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెట్టుబడులే లక్ష్యంగా మంత్రి లోకేశ్ విదేశీ పర్యటన

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అమెరికాలో పర్యటిస్తున్నారని, నిర్విరామంగా రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేయడం అభినందనీయమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నారా లోకేశ్ అమెరికా పర్యటన అవిశ్రాంతంగా కొనసాగుతోందని, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యా నాదెళ్ల, శాన్‌ఫ్రాన్సిస్కోలో అడోబ్ సీఈవో శంతను నారాయణ్‌తో పాటు అనేక ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో లోకేశ్ భేటీ అయి ఏపీలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించేందుకు సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలో కూడా చంద్రబాబు ఇలానే ప్రపంచవ్యాప్తంగా పర్యటించి అనేక పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురాగలిగారని, అలుపెరుగని ఆయన కృషితోనే నేడు సైబరాబాద్ నగరాన్ని నిర్మించారని, త్వరలోనే అమరావతి కూడా దేశంలోనే నెంబర్ వన్‌గా మారుతుందన్న నమ్మకం ప్రజలకు ఉందని చెప్పారు. ప్రధాని మోదీ సహకారంతో వేగంగా అభివృద్ధి, సంక్షేమం దిశగా అడుగులు వేస్తున్నారని, కానీ అవేవీ పట్టని జగన్ రెడ్డి, వైసీపీ నేతలు మాత్రం తల్లికి, చెల్లికీ అన్యాయం చేసిన జగన్ వ్యవహారాన్ని తెర మీదకు తెచ్చి దారి మళ్లించాలని చూస్తున్నారని విమర్శించారు.

కార్యకర్తల సంక్షేమానికి అధినేత చంద్రబాబు కృషి

● తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్



సభ్యత్వం నమోదు చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి అధినేత చంద్రబాబు అద్భుతమైన కృషి చేస్తారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని 15వ డివిజన్ ఐపీడీ కాలనీలో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని, సభ్యత్వం నమోదు చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమమే టీడీపీ అధినేత చంద్రబాబు, మంత్రి లోకేశ్ లక్ష్యం అని, వారు ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. సభ్యత్వం నమోదు చేసుకున్న కార్యకర్తలకు పార్టీ ఇచ్చే బీమా వారి జీవితాలకు భరోసా అని, రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల ప్రమాద బీమా వస్తుందని చెప్పారు. కార్యకర్తలకు విద్య, వైద్యం, ఉపాధి కోసం తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సూరే శీను, మాజీ కార్పొరేటర్ ఈర్ల గురవయ్య, పాటిబండ్ల శీను, పుత్తగాని వెంకటేశ్వరరావు, పొందూరి నాగేశ్వరరావు, సూరం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ దీపం-2 ఉచిత గ్యాస్ సిలిండర్లు

● జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ భార్గవ్ తేజ

గుంటూరు సిటీ, అక్టోబర్ 29 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి మ్యానిఫెస్టో హామీలలో భాగం గా ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులందరికీ దీపం-2 పేరుతో అందించ బోయే మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు జిల్లాలోని అర్హులందరికీ అందుతాయని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ అన్నారు. గుంటూరులో జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ఆయిల్ కంపెనీల గ్యాస్ ఏజెన్సీలు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల సేల్స్ మేనేజర్స్‌తో మంగళవారం సమావేశం జరిగింది. నవంబరు ఒకటవ తేదీన ముఖ్యమంత్రి ఈ కార్యక్రమం ప్రారంభిస్తారని జేసీ తెలిపారు. మొదటి సిలిండర్ బుకింగ్ కోసం ఎక్కువ రద్దీ ఉండవచ్చని, దీనిని దృష్టిలోపెట్టుకుని భారీ క్యూ లైన్‌లలో వినియోగదారులు వేచిచూడకుండా ఏర్పాట్లు చేసుకోవాలని జేసీ సూచించారు. వినియోగదారులు దీపం-2 పథకం కింద సబ్సిడీ గ్యాస్ సిలిండర్ బుకింగ్ కొరకు ఎటువంటి దరఖాస్తు చేయవలసిన అవసరం లేదని, దీపం-2 పథకం కింద సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పొందుటకు యాక్టివ్‌గా ఉన్న గ్యాస్ కనెక్షన్, ఆధార్ కార్డు తప్పనిసరని, మొదటి సిలిండర్ బుకింగ్ కోసం ఈనెల 29 నుంచి 2025 మార్చి 31 వరకు వ్యవధి ఉన్నందున, వినియోగదారులు తొందర, ఆందోళన చెందాల్సిన పని లేదని జేసీ అన్నారు. ఇంతకు ముందులా ఐవీఆర్ఎస్/మిస్ డ్ కాల్/వాట్సాప్/ ఆన్‌లైన్ వెబ్‌సైట్/ గూగుల్ లేదా ఫోన్ పే/అమెజాన్ యాప్ ద్వారా అంటే ఎలా బుక్ చేసినా మీకు అర్హత ఉంటే, తప్పకుండా సబ్సిడీ డబ్బు మీ ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. బ్యాంకులో ఈకేవైసీ చేయించుకోవాలని అన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం, 22వ వార్డు, వెంకయ్య నాయుడు వీధి, డోరు నెం.22-13-18 రు కాపురస్తులు శిరం నితీష్ గారి భార్య వబిలిశెట్టి లక్ష్మీ శిరీష సంజాయిషీ పొంది తెలియజేయునది.

యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని గుంటూరు సిటి కాపురస్తులు లేటు తోష్నివాల్ చతుర్భుజ్ గారి కుమారుడు (1) తోష్నివాల్ రమేష్ కుమార్, తోష్నివాల్ సత్యనారాయణ గారి కుమారుడు (2) తోష్నివాల్ ప్రకాష్ చంద్ర, (3) తోష్నివాల్ మహేష్ కుమార్ అను వార్లు డి.24.09.2004వ తేదీన ద.నెం.12679/2004రు దాఖలా పరిమి వెంగయ్య గారి భార్య పరిమి ఆదిలక్ష్మీ గారి వలన విక్రయం పొంది వారి స్వాధీన హక్కులలో ఉండియున్నది. నా క్లయింటుకు విక్రయించుటకు డి.27.10.2024వ తేదీన ఖరారు పడియున్నారు. కావున పైన తెలిపిన విక్రయదారులు నా క్లయింటుకు విక్రయించు ఆస్తిపై ఎట్టి వివాదములు ఋణ్ములు లేవని నా క్లయింటు తెలిపియున్నారు. కావున షెడ్యూలు ఆస్తి నా క్లయింటు విక్రయం పొందుటలో ఎవరికైనా ఆక్షేపణ ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలో లిఖితపూర్వకముగా తెలియజేయవచ్చును. అట్లు తెలియపరచని యెడల ఎట్టి ఆక్షేపణ లేదని నా క్లయింట్ విక్రయం పొందగలరు.

షెడ్యూలు : గుంటూరు డి. గుంటూరు సబ్ డి. గుంటూరు మునిసిపల్ కార్పోరేషన్ లిమిట్స్, గుంటూరు సిటీ, బ్రాడీపేట, 2/13వ లైను నందలి మునిసిపల్ పాత వార్డు నెం.2 రు, బ్లాకు నెం.4 రు, టి.యస్.నెం.252 రు, విస్తీర్ణం య. 0-4862 చ.అ.లు మింజుమలె చ.గ.302.87లు ఆస్తిలో ఉత్తరపు దరి, చ.గ.156.2/9 లు స్థలము, యిందలి డోరు నెం.5-30-5, 5-30-5/ఏ ర్లు, మున్సిపల్ పాత అసెస్మెంటు నెం. 8775 రు, కొత్త అసెస్మెంటు నెం.1021023153 రు గల ఆర్.సి.సి. బిల్డింగ్ యిల్లునకు హద్దులు - తూర్పు : పి.వెంకటప్పయ్య గారి ఆస్తి, యీ ఆస్తి ప్రహరీ గోడ హద్దు అ.24 అం.9లు, దక్షిణం : మేము యీ రోజున బెల్లి జ్ఞానరమ్య గారికి విక్రయ ఖరారుపడిన ఆస్తి హద్దు అ.60 అం.3 లు, పడమర : మునిసిపల్ కార్పోరేషన్ వారి రోడ్డు హద్దు అ.22 లు, ఉత్తరం : నారస్వామి గురవారెడ్డి, కనుమర్ల శ్రీనివాసరెడ్డి గారల ఆస్తి హద్దు అ.60 అం.7 లు, యీ హద్దుల మధ్య చ.గ.156.3/9 లు లేక చ.మీ.130.68 ల్లు స్థలం, యిందలి ఆర్.సి.సి. బిల్డింగ్ యిల్లు.

ఇట్లు : యమ్.వి.సుబ్బారావు (అడ్వకేట్)
మట్టుపల్లి కాంప్లెక్స్, 8-9 అరండల్‌పేట, సెల్ నెం: 9396999958.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ గుంటూరు సిటీ, అరండల్‌పేట 5/5వ లైను, డోరు నెం.6-5-104రు కాపురస్తులు శిరం శ్రీ సుఖేష్ గారి భార్య బెల్లి జ్ఞానరమ్య సంజాయిషీ పొంది తెలియజేయునది.

యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని గుంటూరు సిటి కాపురస్తులు లేటు తోష్నివాల్ చతుర్భుజ్ గారి కుమారుడు (1) తోష్నివాల్ రమేష్ కుమార్, తోష్నివాల్ సత్యనారాయణ గారి కుమారుడు (2) తోష్నివాల్ ప్రకాష్ చంద్ర, (3) తోష్నివాల్ మహేష్ కుమార్ అను వార్లు డి.24.09.2004వ తేదీన ద.నెం. 12679/2004 రు దాఖలా పరిమి వెంగయ్య గారి భార్య పరిమి ఆదిలక్ష్మి గారి వలన విక్రయం పొంది వారి స్వాధీన హక్కులలో ఉండియున్నది. నా క్లయింటుకు విక్రయించుటకు డి.27.10.2024వ తేదీన ఖరారు పడియున్నారు. కావున పైన తెలిపిన విక్రయదారులు నా క్లయింటుకు విక్రయించు ఆస్తిపై ఎట్టి వివాదములు ఋణ్ములు లేవని నా క్లయింటు తెలిపియున్నారు. కావున షెడ్యూలు ఆస్తి నా క్లయింటు విక్రయం పొందుటలో ఎవరికైనా ఆక్షేపణ ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలో లిఖితపూర్వకముగా తెలియజేయవచ్చును. అట్లు తెలియపరచని యెడల ఎట్టి ఆక్షేపణ లేదని నా క్లయింట్ విక్రయం పొందగలరు. షెడ్యూలు: గుంటూరు డి. గుంటూరు సబ్ డి. గుంటూరు మునిసిపల్ కార్పోరేషన్ లిమిట్స్, గుంటూరు సిటీ, బ్రాడీపేట, 2/13వ లైను నందలి మునిసిపల్ పాత వార్డు నెం.2 రు, బ్లాకు నెం.4 రు, టి.యస్.నెం.252 రు, విస్తీర్ణం య. 0-4862 చ.అ.లు మింజుమలె చ.గ.302.87లు స్థలము యిందలి మున్సిపల్ పాత అసెస్మెంటు నెం. 8775 రు, కొత్త అసెస్మెంటు నెం. 1021023153 రు, పాత డోరు నెం.5-30-5 రు, కొత్త డోరు నెం.5-30-5/ఏ రులో దక్షిణ దిశ, చ.గ.146.6/9 లు స్థలము, యిందలి ఆర్.సి.సి. బిల్డింగ్ యిల్లునకు హద్దులు తూర్పు : పి.వెంకటప్పయ్య గారి ఆస్తి, యీ ఆస్తి ప్రహరీ గోడ హద్దు అ.22లు, దక్షిణం : సొలసా సీతారావమ్మ గారి ఆస్తి, యీ ఆస్తి గోడ హద్దు అ.59 అం.10 లు, పడమర : మునిసిపల్ కార్పోరేషన్ వారి రోడ్డు హద్దు అ.22 లు, ఉత్తరం : మేము యీ రోజున వబిలిశెట్టి శిరీష గారికి విక్రయ ఖరారుపడిన ఆస్తి హద్దు అ.60 అం.2 లు. యీ హద్దుల మధ్య చ.గ.146.6/9 లు లేక చ.మీ.122.57 ల్లు స్థలం, యిందలి ఆర్.సి.సి. బిల్డింగ్ యిల్లు.

ఇట్లు : యమ్.వి.సుబ్బారావు (అడ్వకేట్)
మట్టుపల్లి కాంప్లెక్స్, 8-9 అరండల్‌పేట, సెల్ నెం : 9396999958.

నాకు బిర్యానీ పెట్టండి

● కస్టడీలో బోరుగడ్డ డిమాండ్

● విచారణలో అనిల్ అబద్ధాలపై నివేదిక సిద్ధం చేసిన పోలీసులు



జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బోరుగడ్డ

గుంటూరు అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): 'నాకు బిర్యానీ తినాలని ఉంది. తెప్పించండి. లేదా ఇంటి నుంచైనా ఆహారం తెప్పించండి.' అని పోలీస్ కస్టడీలో ఉన్న వైసీపీ సానుభూతిపరుడు, రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ అరండల్‌పేట పోలీసులను డిమాండ్ చేశా డు. నిబంధనలు ఒప్పుకోవని చెప్పి మెస్ నుంచి భోజనం తెప్పించారు. మంగళవారం బోరుగడ్డ అనిల్‌ను పోలీసులు న్యాయాధికారి ఎదుట హాజరు పరిచిన సమయంలో ఆయ న ఈ విషయంపై ఫిర్యాదు చేశాడు. నాకు మట్టి గడ్డలు, రాళ్లు ఉన్న అన్నం పెట్టారని చెప్పగా న్యాయాధికారి స్పందిస్తూ తాము తినేది కూడా అదే అనడంతో అనిల్ మిన్నకుండిపోయాడు. ఓ కేసులో రాజమండ్రి సెంట్రల్ జైలు రిమాండ్‌లో ఉన్న అనిల్‌ను కోర్టు అనుమతితో ఆది, సోమవారాల్లో అరండల్‌పేట స్టేషన్‌లో పోలీసులు విచారించారు. కోర్టు ఇచ్చిన గడువు ముగియడంతో మంగళవారం మధ్యాహ్నం జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం, ఆయనను ఐదో అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి మళ్లీ రిమాండ్ విధించడంతో అనిల్‌ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. కస్టడీ ముగియడంతో వైద్య పరీక్షల నిమిత్తం బోరుగడ్డను జీజీహెచ్‌కు తీసుకెళ్లిన సమయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ తరువాత ఆయన పేరుతో ప్రకటనలు కూడా విడుదల చేశారు. విచారణ సందర్భంగా పోలీసులు తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారంటూ చెప్పారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్న కొన్ని మీడియా సంస్థలకు తాను జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ద్వారానే సమాధానం చెప్తానని బోరుగడ్డ హెచ్చరించారు. తాను జగన్‌కు సానుభూతిపరుడుగా ఉన్నానని, కావాలనే రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

నేడు మంగళగిరి కోర్టుకు

కస్టడీ ముగియడంతో అరండల్‌పేట పోలీసులు మంగళవారం అనిల్‌ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకెళ్లారు. అయితే, గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మే 9న రాత్రి తుళ్లూరులో జరిగిన రెండు ఘటనల్లో బోరుగడ్డ అనిల్ నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసుల్లో నిందితుడైన బోరుగడ్డను రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి పీటీ వారెంట్‌పై తీసుకువచ్చి బుధవారం మంగళగిరి కోర్టులో హాజరు పరచనున్నారు. అరండల్‌పేటలో పోలీసుల విచారణ లో ప్రాథమికమైన అంశాల్లోనూ కేసులు తప్పుదారి పట్టించేలా అనిల్ అబద్ధాలు చెప్పాడని పేర్కొంటూ నివేదిక సిద్ధం చేశారు. దీనిని కోర్టుకు సమర్పించనున్నారు.

నవంబరు 10 నుంచి బాల కళాప్రభ లలిత కళల పోటీలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణనగర్ లోటస్ ఆద్య పాఠశాలలో నవంబరు 10 నుంచి "బాల కళాప్రభ" పేరుతో రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు బాలానంద కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బ్రాడీపేట బాలానంద కేంద్రంలో కార్యక్రమాల గోడ ప్రతులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1 నుంచి 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. తెలుగు పద్యం, శాస్త్రీయ జానపద నృత్యాలు, చిత్రలేఖనం, సంస్కృత శ్లోకాలు, శాస్త్రీయ సంగీతం(గాత్రం), జానపద, దేశభక్తి గీతాలు, వాద్య సంగీతం, కీబోర్డుల అంశాలలో పోటీలు జరుగుతాయని అన్నారు. నవంబరు 14 బాలల దినోత్సవం రోజున జరిగే సభలో విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు ప్రశంస పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. పోటీలలో పాల్గొనే విద్యార్థినీ, విద్యార్థుల వివరాలతో కూడిన సమాచారం పాఠశాల యాజమాన్యాలు ఈ నెల 8వ తేదీలోగా వాట్సప్ నంబర్లు 91863 85890, 89199 81839కు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నడింపల్లి గురుదత్, సహాయ కార్యదర్శి బి.శ్రీనివాస్, మాచిరాజు రాజేష్, పీఎస్ఆర్ కిరణ్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కిక్ కొడితే.. పతకమే

కిక్ బాక్సింగ్‌లో రాణిస్తున్న నాగబాబు

- తమ్ముడు, భద్రాచలం సినిమాలను చూసి ఆసక్తి
- జాతీయ స్థాయిలో రాణించి ఏషియన్‌లో సత్తా చాటిన బాక్సర్
- వచ్చే ఏడాది ఇటలీలో జరిగే ప్రపంచకప్‌కు సిద్ధమవుతున్న క్రీడాకారుడు



రింగ్‌లో దిగి కిక్ కొడితే ప్రత్యర్థులు తలొగ్గాల్సిందే. పోటీలో పాల్గొంటే పతకం లేకుండా వెనుదిరగడు. అది జాతీయ స్థాయి అయినా.. అంతర్జాతీయ స్థాయిలో అయినా. ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతున్న కిక్ బాక్సింగ్‌లో మారుమూల గ్రామానికి చెందిన యువకుడు అనేక అద్భుతాలు సృష్టిస్తున్నాడు. పవన్‌కల్యాణ్ నటించిన తమ్ముడు, శ్రీహరి నటించిన భద్రాచలం సినిమాల్లో హీరోల ప్రదర్శనలను చూసి బాపట్ల జిల్లా రేపల్లె మండలం కారుమూరు గ్రామానికి చెందిన యాసం కోటి నాగబాబు రాష్ట్ర ప్రజలకు క్రీడను పరిచయం చేస్తూనే కిక్ బాక్సింగ్‌లో ప్రావీణ్యం సంపాదిస్తున్నాడు. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ పోటీలలో అనేక పతకాలు సాధించి, దాతలు సహకరిస్తే వచ్చే ప్రపంచ పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి పతకాలు సాధిస్తానని ధీమాగా చెబుతున్నాడు కోటి నాగబాబు.

గుంటూరు(తూర్పు), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రాణాలకు పణంగా పెట్టి ఆడే ఆట కిక్ బాక్సింగ్. దేశంలో ఇంకా అంతగా ప్రాచుర్యం పొందలేదు. అయినా ఉమ్మడి గుంటూరు జిల్లాలో మారుమూల గ్రామం నుంచి కిక్ బాక్సింగ్‌లో అంతర్జాతీయంగా కోటి నాగబాబు రాణిస్తున్నాడు. సామాన్య కుటుంబానికి చెందిన ఇతడు కిక్ బాక్సింగ్‌లో ప్రావీణ్యం సాధిస్తున్నాడు. ఇప్పటి వరకు అనేక పతకాలు సాధించాడు. బాక్సింగ్ కంటే కిక్ బాక్సింగ్ క్లిష్టతరం. ఒక్కోసారి ప్రాణం పోయే ప్రమాదం కూడా ఉంటుంది. అందుకే కొన్ని రాష్ట్రాలు ఈ క్రీడకు గుర్తింపు ఇవ్వడానికి వెనకడుగు వేస్తున్నాయి. అయినా కిక్ బాక్సింగ్‌పై ప్రేమతో ఈ క్రీడను ఎంచుకున్నానని నాగబాబు చెబుతున్నాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు రేపల్లె మండలం, అడవుల దీవిలో జరిగింది. ఆ తర్వాత గుంటూరులో ఉన్న బంధువుల ఇంట్లో ఉంటూ తైక్వాండోలో శిక్షణ తీసుకున్నాడు. శారీర దారుఢ్యాన్ని పరిశీలించి బాక్సింగ్ వైపు ప్రయత్నం చేయాలని కొంతమంది సూచించారు. దీనికి తోడు కిక్ బాక్సింగ్ నేపథ్యంలో రూపొందించిన తమ్ముడు, భద్రాచలం సినిమాలను చూసి స్ఫూర్తి పొంది ఆ దిశగా అడుగులు వేశాడు. ఈ క్రమంలో గుంటూరుకు చెందిన సీనియర్ కోచ్ ఆనందరావు శిక్షణ ఇచ్చారు. తైక్వాండ్‌లో జయంత్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. కిక్ బాక్సింగ్‌లో సీనియర్ కోచ్ పవన్ నుంచి నైపుణ్యాలు తెలుసుకున్నాడు. తొలుత తైక్వాండ్‌లో శిక్షణ పొందినా దానిని కొనసాగించలేక పోయాడు. రెవెన్యూశాఖలో పని చేసే తల్లి ప్రోత్సాహంతో కిక్ బాక్సింగ్ వైపు వెళ్లి అద్భుతాలు సాధించాడు. 2022లో ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన పోటీలో మూడో స్థానంలో నిలిచాడు. 2023లో జరిగిన 69 కేజీల విభాగంలో జాతీయ పోటీలో 7వేల మంది పాల్గొనగా అందులో 17వ స్థానం నిలిచాడు. దీంతో జాతీయ సెలక్టర్ల దృష్టిలో పడి సిమ్లాలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైయ్యాడు. 23 దేశాలు పాల్గొన్న ఈ పోటీలో కిక్ లైటింగ్, క్రియోటీ ఫామ్ విభాగాల్లో మూడో స్థానం సాధించాడు. ఊటీలో అంతర్జాతీయ శిక్షణకు ఎంపికై 2024లో జరిగిన నేషనల్ చాంపియన్‌షిప్‌లో ఐదో స్థానం సాధించాడు. ఈ ఏడాది అక్టోబరు 6 నుంచి కంబోడియాలో జరిగిన ఏషియాడ్‌లో అద్భుతాలు సృష్టించాడు. 84 కేజీల కిక్ లైటింగ్, లైటింగ్ కాంటాక్టు విభాగాల్లో 3, 4 స్థానాల్లో నిలిచి కాంస్య పతకాలు సాధించాడు. రాష్ట్ర చరిత్రలో రెండు పతకాలు సాధించిన ఏకైక క్రీడకారుడుగా నిలిచి 2025లో ఇటలీలో జరిగే ప్రపంచకప్‌కు ఎంపికయ్యాడు.


పతకాలతో కోటి నాగబాబు



కోటి నాగబాబును అభినందిస్తున్న తులసి రామచంద్రప్రభు, ఉగ్గిరాల సీతా రామయ్య తదితరులు


కోటి నాగబాబును సత్కరిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తల్లి ప్రోత్సహంతోనే...



రెవెన్యూ విభాగంలో పని చేసే మా అమ్మ ప్రోత్సాహంతో కిక్ బాక్సింగ్‌లో ప్రావీణ్యం సాధించాను. ఇప్పటి వరకు పాల్గొన్న పోటీలకు రూ.40 లక్షలు ఖర్చు కాగా పారిశ్రామికవేత్త తులసి రామచంద్రప్రభు ఆ మొత్తాన్ని భరించారు. టీడీపీ నాయకుడు ఉగ్గిరాల సీతారామయ్య కూడా సహకరించారు. శారీర ధారుఢ్యానికి, ఆహారానికి నెలకు రూ.లక్ష అవసరం. ఇటలీలో జరిగే పోటీలకు వెళ్లేందుకు దాతలు సహకారం అవసరం ఉంది.

-యాసం కోటి నాగబాబు

పట్టభద్రుల ఓటుకు లక్షా 24 వేల దరఖాస్తులు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ నాగలక్ష్మి


ఓటర్ జాబితాలపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతున్నదని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆమె ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరి రివిజన్ 2025, ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ఓటర్ల నమోదుపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్ల నమోదుకు ఇప్పటి వరకు ఫారం-18లు 1,24,504 అందాయన్నారు. నవంబరు 6వరకు దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆయా పార్టీల ప్రతినిధులు సేవా కుమార్, చిరుతనగండ్ల వాసు, సీహెచ్ కుమార్‌గౌడ్, సునీల్ కుమార్, ఎన్ ఓంకార్, డీఆర్వో పెద్ది రోజా, ఈఆర్వోలు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, డీఆర్డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఓబులేసు, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఇస్మాయిల్, డీటీ ప్రదీప్ పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌లు

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఏపీసీఆర్‌డీఏలో భూముల రిజిస్ట్రేషన్లు, పెండింగ్ భూసేకరణ/సమీకరణ, రైల్వే, ఇతర ప్రాజెక్టులకు అవసరమైన భూములను సమకూర్చాల్సి ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం పలువురు డిప్యూటీ కలెక్టర్లను పోస్టింగ్ చేసిందని. ఏపీసీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్-1గా ఏజీ చిన్ని కృష్ణ, డీసీ-2గా డీ హుస్సేన్ సాహెబ్, డీసీ-3గా గంధం రవీందర్, డీసీ-4గా ఎన్ఎస్‌వీబీ వసంతరాయుడు, డీసీ-5గా కేఎస్ భాగ్యరేఖ, డీసీ-6గా టీకే వెంకటేశ్వర్లు, డీసీ-7గా పీ పద్మావతిలను నియమించింది. గతంలో వేర్వేరు మండలాల్లో తహసీల్దార్‌గా విధులు నిర్వహించి డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన తాతా మోహన్ రావుకు ప్రోటోకాల్ డైరెక్టర్‌గా పోస్టింగ్ కల్పించింది. అలానే టీ బాపిరెడ్డిని శ్రీకాళహస్తి దేవాలయం ఈవోగా నియమించింది. గుంటూరు డీఆర్వో పెద్ది రోజాని బాపట్ల మెప్మా పీడీగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువరించింది.

దీపావళి రద్దీ నియంత్రణకు చర్యలు

- గుంటూరు రైల్వే డీసీఎం కమలాకర్‌బాబు


ప్రయాణికులతో మాట్లాడుతున్న రైల్వే అధికారులు

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండగ రద్దీ నియంత్రణకు గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని రైల్వేస్టేషన్లలో అన్ని చర్యలు చేపట్టినట్లు డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కమలాకర్‌బాబు చెప్పారు. మంగళవారం సాయంత్రం గుంటూరు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ నియంత్రణ చర్యలను ఆయన పర్యవేక్షించారు. టిక్కెట్ కౌంటర్లు, ఎల్ఈడీ డిస్‌ప్లే కోచ్ ఇండికేటర్ బోర్డులు, హెల్ప్ డెస్కు, ప్లాట్‌ఫాంపై రైలు వచ్చే సమయంలో ప్రయాణికులు ఒకేసారి రైలు ఎక్కేందుకు ప్రయత్నించకుండా ఆర్‌పీఎఫ్ చేస్తున్న కట్టడి చర్యలను ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. డివిజన్‌లోని అన్ని ముఖ్యమైన రైల్వేస్టేషన్లలో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశామని, ప్రత్యేక రైళ్ల వివరాలు, వాటి సమయ పట్టికలను ప్రదర్శిస్తున్నామన్నారు. రైళ్ల రాకపోకల సమాచారాన్ని తరచుగా మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా తెలియజేస్తున్నాం అన్నారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో అదనపు టిక్కెట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైలు బోగీల్లోకి అన్‌బోర్డింగ్, బోర్డింగ్ చేసే సమయంలో రోప్ పార్టీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సిబ్బంది అందరూ యూనిఫాం ధరించి విధులకు హాజరౌతుండటం వలన ప్రయాణికులు వారిని సులభతరంగా గుర్తు పట్టొచ్చని చెప్పారు. క్యాటరింగ్ స్టాల్స్‌లో పరిశుభ్రమైన ఆహారం ఉండేలా చూస్తున్నామన్నారు. లిఫ్టులు, ఎస్కలేటర్లు 24 గంటలు పని చేసేలా చూస్తున్నాం. వృద్ధులు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు, పోర్టర్లను అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, సీవీఎస్ఆర్ జయకుమార్, సీటీఐ కె.శ్రీనివాసరావు, ఆర్‌పీఎఫ్ సీఐ వీరబాబు, ఎస్ఐ కె.క్రీస్తుదాసు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ జిల్లాల చదరంగం పోటీలు

చుండూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): యడ్లపల్లి ఆలపాటి వెంకట్రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు సాగిన 68వ అంతర్ జిల్లాల అండర్-17 బాల బాలికల చదరంగం పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 130 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరుపున ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో తూర్పు గోదావరికి చెందిన అల్లూరి భాస్కరరత్న షణ్ముఖరెడ్డి, కృష్ణా జిల్లాకు చెందిన తాళ్ల నిర్చల్, కర్నూలుకు చెందిన యు.హర్షవర్ధన్, తూర్పు గోదావరికి చెందిన కనపర్తి సీతాసాగర్, విశాఖకు చెందిన వెంపరాల వెంకటేశ్వరరావు వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో నెల్లూరు జిల్లాకు చెందిన గడ్డేటి హిమతేజస్విని, వేముల ప్రద్యుమ్నలక్ష్మి, గుంటూరు జిల్లాకు చెందిన ఆమంచి నాగశివసాయిదివ్య, అనంతపురంకు చెందిన జి.శిరీష, పశ్చిమ గోదావరికి చెంది సోనాలి శ్రీమణి, కార్తీక్ కన్న విజేతలుగా నిలిచారు. టీం ఈవెంట్ బాలుర విభాగంలో వరుసగా తూర్పు గోదావరి, విశాఖ, పశ్చిమ గోదావరి జిల్లా జట్లు, బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి, గుంటూరు, నెల్లూరు జట్లు విజయకేతనం ఎగుర వేశారు. విజేతలైన వీరు మన రాష్ట్రం తరుపున నవంబరు 17 నుంచి మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ చదరంగం పోటీల్లో పాల్గొంటారు. విజేతలకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.పురుషోత్తం బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుర్రా శ్రీనివాసరావు, రావి సాయిబాబా, భయ్యా సతీష్, విద్యా శాఖ అధికారులు ఆర్.చలపతిరావు, సాల్మన్‌రాజు, భానుప్రకాష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వేమూరి శరత్‌బాబు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న రౌడీషీటర్లు

ఉండేది ఒకచోట.. దందా మరోచోట

రౌడీషీటర్లతో పలువురు పోలీసుల దోస్తీ

సగానికి సగం మంది కౌన్సెలింగ్‌కు దూరం

గుంటూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్లు రెచ్చిపోతున్నారు. పోలీసులు పట్టుకోల్పోతుండటంతో యథేచ్ఛగా దందాలు, బెదిరింపులు, వసూళ్లతో పాటు హత్యలు, హత్యాయత్నాలు, భూవివాదాలు, బెదిరింపులతో చెలరేగిపోతున్నారు. గడిచిన వైసీపీ పాలనలో ఆ పార్టీ నేతల నీడన చేరిన రౌడీషీటర్లు పలువురు పోలీస్ వ్యవస్థకే సవాల్‌గా మారారు. ఆధిపత్యం కోసం ప్రత్యర్థులనే కాదు ఎదురు తిరిగితే అమాయకులను సైతం నడి రోడ్డుపై దారుణంగా హత్య చేసిన ఘటనలు అనేకం చోటుచేసుకున్నాయి. గుంటూరులో పేరుమోసిన రౌడీషీటర్లు అజ్ఞాతంలో ఉంటూ తమ అనుచరులతో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పేరు మోసిన అనేక మంది రౌడీషీటర్ల కార్యకలాపాలు పోలీస్ వర్గాలకు సైతం అంతుపట్టని విధంగా ఉంది. వారు నివాసం ఉండేది ఒక ప్రాంతం అయితే.. కార్యకలాపాలు సాగించేది మరో ప్రాంతం, అదేవిధంగా వారిపై రౌడీషీట్ ఉండేది ఇంకో ప్రాంతంలోని స్టేషన్లో కావడం గమనార్హం కరడు కట్టిన అనేకమంది రౌడీషీటర్లు ఏం చేస్తున్నారనేది పోలీసులకు అంతుపట్టడం లేదు. ప్రతి ఆదివారం నిర్వహించే కౌన్సిలింగ్ కేవలం ఫొటోల ఫోజులకే పరిమితం అవుతుంది. ఆయా పోలీస్ స్టేషన్లో ప్రతి ఆదివారం నిర్వహించే కౌన్సెలింగ్‌కు సగానికి సగం మంది కూడా హాజరు కావడం లేదు. మిగిలిన వారి కార్యకలాపాలు ఏమిటనేది ఆరాతీసే ప్రయత్నం కూడా పోలీసులు చేయడం లేదు. కొన్ని స్టేషన్ల పరిధిలో పోలీసులు రౌడీషీటర్లకు సహకరిస్తున్నారనే ఆరోపణలు న్నాయి. కనీస భయం కూడా లేకుండా పోలీసులు చెలరేగిపోతుండటం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. గుంటూరులో ఇటీవల రౌడీషీటర్ పాదర్తి రమేష్‌పై కోర్టుల్లో ఉన్న కేసులు కొట్టేయించేందుకు ఓ కానిస్టేబుల్ బరితెగించి వైసీపీ నేత గతంలో చనిపోయిన పాదర్తి రమేష్‌గాంధీ డెత్ సర్టిఫికేట్‌ను ఉపయోగించాడంటే రౌడీషీటర్ల విషయంలో పోలీసుల వైఖరి తేటతెల్లమవుతుంది.


గాయపడిన ఇంద్రజిత్


రౌడీషీటర్ సముద్రాల పవన్ (లడ్డూ)


దహనం చేసిన ద్విచక్రవాహనం

తెనాలిలో భయంభయం..

ఒకప్పుడు ప్రశాంత తకు నిలయమైన తెనాలిలో రౌడీమూకలు చెలరేగుతున్నాయి. వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తిన శివకుమార్ అండదండలతో కరుడుగట్టిన రౌడీషీటర్లు తెనాలిలో రెచ్చిపోయారు. ఐతానగర్ పేరు చెబితే కౌన్సిలర్ గడ్డేటి సురేంద్ర, ఆయన స్నేహితుడు సముద్రాల పవన్ కుమార్ అలియాస్ లడ్డు హత్యలతో తెనాలి వాసులను భయభ్రాంతులకు గురి చేసి ఆధిపత్యం ప్రదర్శించారు. అప్పట్లో ఎమ్మెల్యే శివకుమార్‌తో సురేంద్రకు బేధాభిప్రాయాలతో ఆయన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్లకి అనుచరుడిగా కార్యకలాపాలు కొనసాగించాడు. ఆస్థానంలో మరో రౌడీషీటర్ లడ్డు వచ్చి చేరాడు. ఎన్నికలకు ముందు ఐతానగర్ ప్రాంతానికి చెందిన యువకుడి ద్విచక్ర వాహనం తగిలిందనే కారణంతో అతడిపై విచక్షణా రహితంగా దాడి చేసి కొట్టిన దృశ్యాలు అప్పట్లో సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. తాజాగా ఐతానగర్ ప్రాంతంలో నాజర్‌పేటకు చెందిన కాకుమాను ఇంద్రజిత్ అనే యువకుడు వాహనం ఆపలేదనే కారణంతో అతడిపై లడ్డు విచక్షణ రహితంగా దాడి చేసి గాయపరచడమే కాకుండా ద్విచక్ర వాహనాన్ని దహనం చేశాడు. లడ్డు ఆగడాలకు హద్దులేకుండా పోతుందని పోలీసులు పట్టీపట్టినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిఘావర్గాలు రౌడీల కార్యకలాపాల గురించి ఆరా తీసినప్పటికీ ఆయా వివరాలు సేకరించి వారిపై దృష్టి పెట్టాల్సిన స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదే అలుసుగా రౌడీషీటర్‌లు పెట్రేగిపోతున్నారు. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులోనూ అనేక మంది మాజీ రౌడీషీటర్‌లు పాల్గొన్నట్లు ఇప్పటికే పోలీసులు గుర్తించారు. ఈ నేపద్యంలో ఆయా మాజీలపై తిరిగి షీట్‌లు తెరవాలని పోలీస్ అధికారులు భావిస్తున్నారు.

గుంటూరులో చాపకింద నీరులా

ఆధిపత్యం కోసం వరుస హత్యలు, హత్యాయత్నాలతో గుంటూరుని శాసించిన అనేక మంది రౌడీషీటర్లు కాలగర్భంలో కలిసిపోయారు. నగరంలో కొంత ప్రశాంత వాతావరణం నెలకొంటున్న తరుణంలో తిరిగి రౌడీ షీటర్లు రెచ్చిపోతున్నారు. ప్రధానంగా అరండల్‌పేట, లాలాపేట, పాతగుంటూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్ల కార్యకలాపాలు ఇటీవల కాలంలో పెరిగాయి. నగరంలో ఇద్దరు రౌడీషీటర్‌లపై పోలీసులు పీడీ యాక్ట్ పెట్టి ఏడాది పాటు జైలుకు పంపినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. మద్దిరాల గోపి, కుక్కల శివలు పీడీ యాక్ట్ గడువు ముగిసిన అనంతరం జైలు నుంచి విడుదలయ్యాక తిరిగి దందాలు, దాడులు సాగిస్తున్నారు. కళాకారులకాలనీ, రాజీవ్‌గాంధీ నగర్, సంజీవయ్యనగర్, శివనాగరాజు కాలనీ, శారదాకాలనీ, బొంగరాలబీడు తదితర ప్రాంతాల్లో గోపితో పాటు పలువురు రౌడీషీటర్ల హవా కొనసాగుతోంది. అంజనేయకాలనీలో ఓ ఇంటిపై దాడి, ఓ ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశాడు. ఒక హత్య కేసు కూడా గోపిపై లేనప్పటికీ పీడీ యాక్ట్ ప్రయోగించారంటే అతడి నేర స్వభావం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మద్యం, గంజాయి తాగాడంటే దారిన పోయే వారిని కొట్టి డబ్బు గుంజుకోవడం నిత్యకృత్యం. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కరుడుగట్టిన రౌడీషీటర్ కుక్కల శివ కూడా రౌడీ కార్యకలాపాల్లో చురుగ్గా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జైలు నుంచి విడుదలైన కుక్కల శివ ఇటీవల బార్ వద్ద ఓ వ్యక్తిపై దాడి చేశాడు. ఓ యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన రౌడీషీటర్ చింతగుంట్ల ప్రవీణ్ ప్రవీణ్ జైలులో రిమాండ్‌లో ఉన్నాడు. కొరిటెపాడుకు చెందిన కారసాని రమేష్ గత ఎన్నికలకు ముందు వరకు మంత్రి విడదల రజిని వెంట తిరుగుతూ రెచ్చిపోయాడు. ఇటీవల సంగడిగుంటలో యువకులు మధ్య జరిగిన కొట్లాటలో కారసాని రమేష్ దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లైన కావటి రాజేష్, నక్కల దుర్గాప్రసాద్ తదితరులు ఇటీవల పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటోనగర్లో లారీ అసోసియేషన్ వివాదంలో ఓ నాయకుడిపై దాడికి పాల్పడ్డారు. గతంలోనూ రాజేష్ కిరాయి హత్యకు పాల్పడిన కేసులో నిందితునిగా ఉన్నాడు. గతంలో కలపాల ప్రతాప్ అనే రౌడీషీటర్‌పై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. గత ఎన్నికలకు ముందు రౌడీషీటర్ రమేష్‌ను దారుణంగా హత్య చేసిన కేసులో నిందితులైన ఆరిఫ్, మున్నా, బాషాతో పాటు మరో ఇద్దరు రౌడీ షీటర్ల కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గుజ్జనగుండ్లకు చెందిన రౌడీషీటర్ నడ్డి వంశీ అజ్ఞాతంలో ఉండి కార్యకలాపాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గుజ్జనగుండ్లకు చెందిన రౌడీషీటర్ జాకీర్ ఇటీవల క్రోసూరుకు చెందిన రౌడీషీటర్ బాజి ఓ వేడుకకు రాగా డబ్బు డిమాండ్ చేస్తున్నాడనే కారణంతో హత్య చేశాడు. జాకీర్ కూడా ఆయా కార్యకలాపాల్లో చురుగ్గా ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్వర్ణభారతినగర్‌కు చెందిన సిరిపురం బాజీ కూడా ఆ ప్రాంతంలో స్థల వివాదాలు, బెదిరింపులు వంటి కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

గతంలో అరండల్‌పేటలో జరిగిన రౌడీషీటర్ బసవల వాసు హత్య కేసులో నిందితులైన చెకోడీల సతీష్, బుడంపాడు రామకృష్ణ అలియాస్ ఆర్కే, కావటి రాజేష్‌తో పాటు మరికొందరు రౌడీషీటర్ల కార్యకలాపాలు పైకి కనిపించక పో యినా చాపకింద నీరులాగా సాగుతు న్నట్లు నిఘావర్గాలు గుర్తించాయి. సతీష్‌పై ఉన్న రౌడీషీట్‌ను ఫిరంగి పురంస్టేషన్‌కు బదిలీ చేయగా కార్యకలాపాలన్నీ పాతగుంటూరులో సాగుతున్నాయి. అరండల్‌పేట స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా ఉన్న తాడికొండకు చెందిన రౌడీషీటర్ నాగరాజు షీటును తాడికొండ స్టేషన్‌కు బదిలీ చేసినా కార్యకలాపాలన్నీ అరండల్‌పేట పరిధిలోని సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మంగళదాస్‌నగర్‌కు చెందిన సాయి చిల్లర గొడవలతో స్థానికంగా దౌర్జన్యాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాడికొండలో మరో రౌడీషీటర్ రఫీ చురుగ్గా ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పొన్నూరులో ఏకంగా పోలీస్‌స్టేషన్ ముందే రెండు రౌడీ గ్రూపుల మధ్య జరిగిన కొట్లాట అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. వైసీపీకి చెందిన రౌడీషీటర్లు, నాజర్, ఆయన తమ్ముడు జాఫర్‌కు, అంజుమన్ కమిటీ నాయకుడు మాము గ్రూపుకు మధ్య గొడవలు ఉన్నాయి.

మంగళగిరిలో ఆధిపత్య పోరు

మంగళగిరిలో రౌడీషీటర్లు తోట శ్రీను, తాడిపోయిన మహేష్ వర్గాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. గతంలో మహేష్ సోదరుడు ఉమాను తోట శీను మరికొందరు కలిసి హత్య చేశారు. ఇరువర్గాలు అదును కోసం ఎదురు చూస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇసుక దందా వ్యవహారంలో ఇటీవల ఓ వ్యక్తిపై రౌడీషీటర్ హరి అతడి అనుచరులు దాడి చేసిన ఘటన సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. రౌడీషీటర్ తొత్తుక సాయి స్థానికంగా పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు ప్రధాన అనుచరుడైన అబ్బరాజుపాలేనికి చెందిన రౌడీషీటర్ సరిగమల మహేష్ కూడా చురుకుగా ఉన్నాడు. కొద్దిరోజుల క్రితం రాజధాని ప్రాంతంలో ఎస్సీసీ కంపెనీకి చెందిన సెక్యూరిటీ ఫీల్డ్ ఆఫీసర్ బాలకృష్ణపై హత్యాయత్నం చేశాడు.

తెనాలిలో దాడి.. బైకు దహనం

తెనాలి అర్బన్: తెనాలిలో ఓ యువతిని హతమార్చిన రౌడీషీటర్ నైనం మరిచిపోకముందే మరో రౌడీషీటర్ రెచ్చిపోయాడు. ముక్కు ముఖం తెలియని యువకునిపై దాడి చేయడమే కాకుండా ద్విచక్ర వాహనాన్ని కూడా దహనం చేసే ప్రయత్నం చేశాడు. ఐతానగర్‌కు చెందిన రౌడీషీటర్ సముద్రాల పవన్ అలియాస్ లడ్డూ సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఆ దారిన ద్విచక్ర వాహనంపై వెళుతున్న కాకుమాను ఇంద్రజిత్‌ను బండి ఆపమని కేకలు వేశాడు. తనను కాదనుకుని ఇంద్రజిత్ వెళ్లిపోగా మరో వాహనంపై లడ్డూ వెంటపడి దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. ఆపై ఇంద్రజిత్ ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టాడు. గాయపడిన ఇంద్రజిత్ స్నేహితుల సాయంతో ఆసుపత్రిలో చేరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసిరౌడీషీటర్ కోసం గాలింపు చేపట్టారు. జిల్లా ప్రభుత్వవైద్యశాల్లో చికిత్స పొందుతున్న బాధితుడ్ని మంత్రి మనోహర్ పరామర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెనాలిలో అకారణంగా యువకుడు ఇంద్రజిత్‌పై రౌడీషీటర్ దాడిచేయడం బాధాకరమన్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

ప్రకాశం బ్యారేజి దిగువకు 32 వేల 625 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎగువన ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 49 వేల 931 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 45 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 32 వేల 625 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టా కాలువలకు 9 వేల 879 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా కాలువకు 7 వేల 427 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల సమ్మె విరమణ

● బకాయిల చెల్లింపునకు కాంట్రాక్టర్ సుముఖత వ్యక్తం

మంగళగిరి సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): క్లాప్ ఆటోడ్రైవర్లు తొమ్మిది రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెను విరమించారు. ఎంటీఎంసీలో పని చేస్తున్న ఆటోడ్రైవర్లకు మూడు మాసాలుగా చెల్లించాల్సిన వేతనాలను కాంట్రాక్టర్ మంగళవారం నాడు ఆయా వేతనాలను చెల్లించేందుకు సుముఖతను వ్యక్తం చేయడంతో కార్మికులు ఈ సమ్మెను విరమించారు. కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనరు, సీఐటీయూ నాయకులు సంయుక్తంగా జరిపిన చర్చల్లో ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించడంతో సమ్మెను విరమిస్తున్నట్టు సీఐటీయూ నాయకులు ప్రకటించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు పెండింగు జీతాలను చెల్లించేందుకు కార్పొరేషన్ అధికారులు, కాంట్రాక్టరు అంగీకరించారని నాయకులు తెలిపారు. జీతాల పెంపు అంశాన్ని గురించి నవంబరునెలలో తేల్చి చెబుతామని అధికారులు చెప్పారన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ విషయంలో కూడ ప్రభుత్వంతో చర్చించి చెబుతామని అధికారులు చెప్పినట్టు తెలిపారు. నవంబరు నెలలో ఈ అంశాలను తేల్చకుంటే మళ్లీ డిసెంబరులో నిరవధిక సమ్మెను ఆరంభిస్తామని నాయకులు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ చర్చల్లో సీఐటీయూ నాయకులు ఎస్ఎస్ చెంగయ్య, బాలాజీరవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో తప్పులను సరి చేయటమే రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశం

● ఇన్‌చార్జ్ తహసీల్దార్ నగేష్

వట్టిచెరుకూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని యామర్రులో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ఇన్‌చార్జ్ తహసీల్దార్ నగేష్ ముఖ్యఅతిథిగా హాజరై రైతులు అడిగిన పలు సమస్యలకు సమాధానాలు ఇచ్చారు. గతంలో నిర్వహించిన భూసర్వేలో కొన్ని చోట్ల తప్పులు దొర్లాయని, వాటిని గుర్తించి రైతులకు సరైన న్యాయం చేయలనే ఉద్దేశం కోసమే ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు నగేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి రీసర్వే వినతిపత్రాలను స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అక్కారావు, డీటీ దరియావలి, నాయకులు ఉప్పుటూరి సాంబశివరావు, సర్వేయర్ కే వరప్రసాదు, ఇన్‌చార్జ్ ఆర్ఐ ఆదినారాయణ పాల్గొన్నారు.

కొరవడిన పారిశుధ్యం.. వీధుల్లోనే చెత్తాచెదారం

● వ్యర్థాలతో పేరుకుపోయిన సైడుకాల్వలు
● క్షేత్రస్థాయిలో పర్యవేక్షణాలోపం
● చోద్యం చూస్తున్న అధికారులు
● రోగాల బారిన పడుతున్న ప్రజలు


రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారం


సైడు కాల్వలు లేక రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు

పెదనందిపాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పెదనందిపాడులో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. వీధుల్లో ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. మురుగు కాల్వల నిర్వాహణ అస్తవ్యస్థంగా ఉండటంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తుంది. పారిశుధ్య సిబ్బంది కాలువల్లో పూడిక తీసి తొలగించిన వ్యర్థాలను సైతం రహదారులపైనే వదిలేస్తారు. ఇందుకు ప్రధాన కారణం క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపమే. ప్రభుత్వం ఇటీవల స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందు అనేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కేవలం అవి పత్రికా ప్రకటనలకే పరిమితమయ్యాయి. అధికారులు సైతం గ్రామాల్లో సమస్యలపై అర్జీలు చేసినా అవి బుట్టదాఖలు అవుతున్నాయే తప్ప పరిష్కారం అవ్వట్లేదని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తడిపొడి చెత్తలను వేరుగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించాల్సి ఉండగా, వారానికి ఒకటి, రెండు రోజులు మాత్రమే చెత్త సేకరణ చేపట్టడంతో ప్రజలు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేస్తున్నారు. దీంతో రోజుల తరబడి వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేసే బాధ్యత డ్వాక్రాలదే

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు


సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, సీఈవో జ్యోతిబసు

గుంటూరు సిటీ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజలకు చేరువ చేసే బాధ్యత డ్వాక్రా సంఘాలదేనని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మంగళవారం గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ప్రత్తిపాడు నియోజకవర్గ సీసీలు, యానిమేటర్లు, డ్వాక్రా సంఘాల మహిళలతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్తను చూడాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం అన్నారు. గ్రూపు రుణాలు మంజూరు, లబ్ధిదారుల ఎంపికలో అవినీతికి తావు లేకుండా చూడాలని అన్నారు. పసుపు కుంకుమ కింద చంద్రబాబు ఒక్కొక్కరికి రూ.10 వేలు ఇస్తే, ముద్దులు పెట్టే మేధావిని గెలిపించారని ఆయన అధికారంలోకి వచ్చిన తరువాత డ్వాక్రా సంఘాలను అసలు పట్టించుకోలేదని ఎమ్మెల్యే రామాంజనేయులు విమర్శించారు. ఈ సమీక్షలో జడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరిలో సుడి దోమతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

● వ్యవసాయాధికారి కే లక్ష్మి


లేమల్లెపాడులో పొలాన్ని పరిశీలిస్తున్న ఏవో కే లక్ష్మి, రావవ్ విద్యార్థులు

వట్టిచెరుకూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సౌపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా సుంకు ఈత దశలో ఉన్న వరి పైర్లను స్థానిక రైతులతో కలసి మండల వ్యవసాయాధికారి కే లక్ష్మి మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం పంట దశలో ఉన్న వరి పైరును సుడి దోమ ఆశించే ప్రమాదం ఉన్నదని, వరి గింజ బిగిసే వరకు రైతులు ఎప్పటికప్పుడు వరి పైరును పరిశీలిస్తూ సుడి దోమతో అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, ఏఈవో షాహిద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సాయంత్రం లేమల్లెపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మిర్చి మొక్కలు నాటడాన్ని ఏవో లక్ష్మి పరిశీలిస్తూ మొక్క నాటే దశలోనే బీజామృతం ద్రావణంలో ముంచి నాటినట్లయితే తెగుళ్ళ గాని, పురుగు నివారణ గాని తొలి దశలోనే అరికట్టుకోవచ్చన్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నాటిన మిరప మొక్కలు బాగా దెబ్బతిన్నాయని, దీనిని తిరిగి నాటుకోవాలని, నాటే దశలో శాస్త్ర వేత్తల సూచనలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఏవోలు షాహిద్, నాయక్, బాపట్ల కళాశాలకు చెందిన రావవ్ విద్యార్థులు నాటే విధానాన్ని ఏవో వారికి వివరించారు.

సీఆర్డీఏ భూముల్లో ఆక్రమణలు తొలగించుకోవాలి

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు

తుళ్లూరు, అక్టోబరు 29: సీఆర్డీఏ భూములను ఆక్రమంచి కట్టడాలు (గుడిసెలు, రేకుల షెడ్డులు, ఇతర నిర్మాణలు) చేసిన వారు. వెంటనే తొలగించుకోవాలని సీఆర్డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు సూచించారు. వారం క్రితం ఉద్దండ్రాయునిపాలెంలో టిడ్కో గృహాలు వచ్చినా గానీ ఆక్రమించి నివాసం ఉంటు న్న వారికి పది రోజుల క్రితం తొలగించుకోవాలని సీఆర్డీఏ అధికారులు చెప్పినా కాని పెడ చెవిన పెట్టటంతో మంగళవారం స్కూల్ ఎదురు, ఊరి తూర్పు భాగం లో నివాసాలను తొలగించడానికి సీఆర్డీఏ అధికారులు, పోలీసులు సిద్ధమయ్యా రు. ఒక రేకుల షెడ్డును జేసీబీ యంత్రంతో తొలగించగానే మిగిలిన వారు. నిర్మాణం చేసిన రేకుల షెడ్డులు, గొర్రెల పాకాలను తొలగించటం మొదలు పెట్టా రు. ఆక్రమించి నిర్మాణం చేయడం వాస్తవమేనని రెండు రోజుల్లో పూర్తిగా తొలగిస్తామని, అధికారులు యంత్రాలతో తొలగిస్తే నిర్మాణ సామగ్రి ఎలక్ట్రికల్ వస్తువులు పాడవుతాయని విన్నవించటంతో అధికారులు రెండు రోజులు సమయం ఇచ్చారు. ఈ సదంర్భంగా విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ డిసెంబర్ నుంచి రాజధాని నిర్మాణ పనులు ప్రాంరంభమవుతున్న నేపథ్యంలో ఆక్రమించి కట్టిన వాటిని తొలగించుకోవాలని గతంలో సూచించామన్నారు. స్వచ్ఛందగా తొలగించుకుంటే చెప్పకుండానే తీసేస్తామని హెచ్చరించారు.

'సూర్యఘర్'యోజనతో విద్యుత్ ప్రయోజనం

ఫిరంగిపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వారా గృహాలకు విద్యుత్ ప్రయోజనం జరగనున్నదని టాటా సోలార్ డీలర్ జీఎం మూర్తి అన్నారు. మంగళవారం ఫిరంగిపురం పంచాయతీ కార్యాలయంలో టాటా సోలార్ వారు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూర్యఘర్ ద్వారా రూ.78వేల సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్నాయన్నారు. 320 యూనిట్ల లోపు ఉచితంగా సోలార్‌ను వినియోగించు కోవచ్చన్నారు. ఫిరంగిపురంలో 50మంది లబ్ధిదారులు సూర్యఘర్ యోజనను చేయించుకున్నారన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ చంద్రశేఖర్ బాబు, ఏడీఈ గురునాథరావు, ఎస్‌బీఐ మేనేజర్ మణి ప్రసాదు, సర్పంచ్ మేడా బాబు, టాటా సోలార్ మేనేజర్ వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మండల ప్రజానీకానికి అధికారుల దీపావళి శుభాకాంక్షలు

వట్టిచెరుకూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల ప్రజానీకానికి మండల అధికారులు ఎంపీడీవో రమేష్ బాబు, సీఐ రమానాయక్, డీటీ దరియావలి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే దీపావళి మందులు కాల్చుకొనే సమయంలో పిల్లలను దూరంగా ఉంచి బాణసంచా కాల్చే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ రమానా యక్ మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మందులు విక్రయించుకొనే వారు తప్ప నిసరిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.





ఈవీఎంల భద్రతపై జాగ్రత్తలు తీసుకోవాలి

● జేసీ భార్గవ తేజ


ఫిరంగిపురంలోని వీవీ ఫార్మ్ గోడౌన్ వద్ద లాగ్ బుక్‌ను పరిశీలిస్తున్న జేసీ భార్గవ తేజ

ఫిరంగిపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మాసవారి తనిఖీల్లో భాగంగా మంగళవారం గుంటూరు కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎంలు భద్ర పరిచిన గోడౌన్‌ను గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ పరిశీలించారు. అలాగే మండలంలోని రేపూడి గ్రామంలో గల వ్యవసాయ మార్కెట్ యార్డులోని వీవీ పాట్స్ భద్ర పరిచిన గోడౌన్‌ను కూడా ఆయన తనిఖీ చేశారు. సీసీ టీవీ పనితీరు, అగ్ని మాపక పరికరాలను, భద్రతా సిబ్బంది లాగ్ బుక్‌ను, అగ్నిమాపక పరికరాలపై ఎక్స్‌పైర్ తేదీని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈవీఎంల భద్రత విషయంలో రాజీ పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో కే శ్రీనివాసరావు, గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఫిరంగిపురం తహసీల్దార్ జే ప్రసాదరావు, అసిస్టెంట్ ఫైల్ అధికారులు కృష్ణారెడ్డి, షేక్ ఖాశింలు, ఆర్అండ్‌బీ ఏఈ అరుణ్‌కుమార్, ఎలక్షన్ సెక్షన్ పర్యవేక్షకులు ఇస్మాయిల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

‘పొలం పిలుస్తోంది’ రైతులకు ఎంతో ఉపయోగకరం

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

పెదనందిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని పమిడివారిపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు. పంట పొలాలను పరిశీలించారు. గ్రామానికి చెందిన కొమరనేని సోమశేఖర్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రాల్లో సాగవుతున్న బ్లాక్, రెడ్ వరి వంగడాలను పరిశీలించి దిగుబడులపై ఆరా తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పొలం బడి రైతులకు మేలు రకమైన సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. రబీ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రైతులకు శనగ విత్తనాలను 50 శాతం సబ్సిడీకి ఇవ్వాలని, అలాగే గ్రామానికి బస్సు సౌకర్యం లేదని పొన్నూరు, పెదనందిపాడు వెళ్లే బస్సులను గ్రామానికి కూడా వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. సాగు నీరు సరిగా రాకపోవడంతో సాగు చేస్తున్న పంటలు ఎండిపోతున్నాయి అని సకాలంలో సాగు నీరు అందించి పంటలను రక్షించే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎదుట వాపోయారు. డిసెంబరు 15 తరువాత వారబంది ద్వారా సాగు నీరు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని ఆమె రైతులకు భరోసా ఇచ్చారు

గ్రామానికి చెందిన కొంత మంది రైతులు తాము బీపీటీ 5204 రకం నంద్యాలకు చెందిన న్యూ వెంకటేశ్వర సీడ్స్ ను కొనుగోలు చేసి సాగు చేశామని వాటిలో 30 శాతం పైగా కల్తీలు వచ్చి దిగుబడులు పై తీవ్ర ప్రభావం చూపుతుందని తమకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ పంట పొలాలను పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు మేలు జరిగేలా నివేదిక రూపొందించాలని ఆదేశించారు. అనంతరం వరగాని ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో 65 మంది రావాల్సి ఉండగా 50 మంది మాత్రమే వచ్చారని విద్యార్థుల గైర్హాజరుపై ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులకు విద్యార్థులు నిత్యం పాఠశాలకు వచ్చే విధంగా అవగాహన కల్పించి పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంగనావాడీ కేంద్రంలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని స్వయంగా తిని సంతృప్తి వ్యక్తం చేశారు. భోజనం పాఠశాలలోనే తయారు చేస్తున్నారా అనే అంశాలను కూడా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఏవో నున్నా వెంకటేశ్వర్లు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రబాబు, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, తహసీల్దార్ శంకరబాబు, ఎంఈవో జాకబ్, ఏవో సుధారాణి, సర్పంచ్ సీతామహాలక్ష్మి, రాంబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

తాడేపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ వ్యాప్తంగా అన్ని వార్డుల్లో మంగళవారం నుంచిసభ్యత్వ నమోదు ప్రారంభిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు తెలిపారు. పార్టీ పట్టణ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రూ.లక్ష కట్టినవారికి శాశ్వత సభ్యత్వంతో పాటు రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారికి గతంలో రెండు లక్షలుగా ఉన్న ప్రమాద బీమాను మూడు లక్షలకు పెంచారని వెంకట్రావు చెప్పారు. 25వేల సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకుని సభ్యత్వ నమోదు చేపట్టామని ప్రజలు, టీడీపీ అభిమానులు, కార్యకర్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దారా దాసు, గోపాలరావు, మేకా పుల్లారెడ్డి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.






సమాచార హక్కు చట్టంపై అవగాహన

● ఏడీఏ రామకోటేశ్వరి


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు

కాకుమాను, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గార్లపాడు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం జరిగింది. పొన్నూరు సబ్ డివిజన్ ఏడీఏ రామకోటేశ్వరి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వం నుంచి జరుగుతున్న ప్రతి కార్యక్రమం వివరాలు, ప్రభుత్వ కార్యాలయానికి సంబంధించిన సమాచారం సామాన్య ప్రజలు కూడా పొందవచ్చని తెలిపారు. ఈ సమాచార హక్కు చట్టం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియమించబడిన కమిషనర్ల ద్వారా పర్యవేక్షణలో ఉంటుందని తెలిపారు. ఏవో కిరణ్మయి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా పౌరులు కోరిన సమాచారం కేవలం 30 రోజుల కాల వ్యవధిలో సంబంధిత శాఖల అధికారులు సమాచారాన్ని అందివ్వాలని చెపాపరు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆ కార్యాలయానికి సంబంధించిన ఉద్యోగులు వివరాలు కార్యాలయం ద్వారా అందించే పథకాలు మొదలగు అంశాలతో కూడిన సమాచారం నిర్ణీత కాలవ్యవధిలో సమాచారం ఇవ్వాలని లేదంటే అప్పిలేట్ అధికారి అప్పిలేట్ అథారిటీకి ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో ఏఈవో శుభనారాయణ, వీహెచ్ఏ గోపినాథ్ యాదవ్, పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ తిరుపతిరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఇసుక అక్రమ రవాణా చేస్తున్న రెండు లారీలు స్వాధీనం

తుళ్లూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న రెండు లారీలను తుళ్లూరు పోలీసులు సోమవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ఉచితంగా ఇసుక తోలుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. అయితే దానికి నిబంధనలున్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా ఇసుకను ట్రాక్టర్లతో వారం రోజుల నుంచి లింగాయపాలెం రీచ్ నుంచి తీసుకెళుతున్నారు. నిర్మాణ అవసరాన్ని స్థానిక అధికారులకు తెలిపి ఇసుకను ఉచితంగా రీచ్‌ల నుంచి తోలుకోవాల్సి ఉంది. కాని దానిని పాటించటం లేదు. ఉచితం అనే దానిని అడ్డం పెట్టుకొని ట్రాక్టర్లతో ఇసుకను తీసుకొచ్చి ఒక చోట డంపు చేసి లారీలకు లోడు చేస్తున్నారు. అలా లోడు చేసి తీసుకెళుతున్న రెండు లారీలను తుళ్లూరు ఎస్ఐ అంకమ్మ అర్ధరాత్రి స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.





చలపతిలో బిగ్‌డేటాపై వర్క్‌షాప్


సీనియర్ సాఫ్ట్‌వేర్ కన్సల్‌టెంట్ అరుణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తాడికొండ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మోతడక చలపతి ఇంజనీరింగ్ కళా శాలలో బిగ్‌డేటాపై కంప్యూటర్ సైన్స్, డేటాసైన్స్ విభాగం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సాఫ్ట్‌వేర్ కన్సల్‌టెంట్ ఎం అరుణ్‌కుమార్ విద్యార్థులకు బిగ్‌డేటాపై అవగాహన కల్పించారు. ప్రస్తుత ఇండస్ట్రీకి అవసరమయ్యే వివిధ నైపుణ్య అంశాలను వివరించారు. బిగ్‌డేటాపై పట్టు సాధిస్తే మంచి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. బిగ్‌డేటా అనేది సాఫ్ట్‌వేర్ రంగంలో ముఖ్యభూమికి పోషిస్తుందని అన్నారు. అనంతరం అరుణ్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే నాగశ్రీనివాసరావు, డీన్లు పీ ఫణికు మార్, వీవీ సుబ్బారావు, పీ బాలమురళీకృష్ణ, డేటాసైన్స్ హెచ్‌వోడీ పీ సాయి శ్రీనివాస్, క్యాకల్టీ డీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.





సమైక్యతే సమతకు సోపానం

● ఏపీ హైకోర్టు స్పెషల్ పీపీ శ్రావణ్‌కుమార్

తాడేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అసేతు హిమాచల పర్యంతం ఈ భూభాగంలో ఉన్న ప్రజలంతా జాతి, మత, కుల, లింగ, బాష, ప్రాంతీయ భేదాలు లేకుండా మనమంతా భారతీయులమనే భావనతో జీవించాలని ఏపీ హైకోర్టు స్పెషల్ పీపీ మన్నవ శ్రావణ్‌కుమార్ (సీబీఐ) అన్నారు. సర్దార్ వల్లభాయిపటేల్ జయంతిని పురస్కరించుకుని కేఎల్‌యూ బీఏ ఏఏఎస్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ ఉత్సవాల్లో పాల్గొని మంగళవారం విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. శ్రావణ్ మాట్లాడుతూ ఉక్కు సంకల్పం కలిగిన వ్యక్తి కాబట్టే వల్లభాయిపటేల్ సుమారు 560కి పైగా స్వదేశీ సంస్థానాలను ఈ దేశంలో విలీనం చేసి మేరా భారత్ మహాన్ అని నిరూపించాడని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన యూనివర్సిటీ ఎంహెచ్ఎస్ విభాగం డీన్ ఎం కిషోర్‌బాబు మాట్లాడుతూ భారతీయులంతా అన్ని విషయాలలో ఏకతాటిపై ఉండి భరతమాత రుణం తీర్చుకున్నప్పుడే పటేల్ వంటి త్యాగ పురుషులు పడిన శ్రమకు సార్థకత లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వీసీ డాక్టర్ సారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, బీఏ ఐఏఎస్ విభాగ అధిపతి డాక్టర్ పి.శివనాగయ్య, ఉప అధిపతి డాక్టర్ కె.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





ముత్యాలరావు సేవలు చిరస్మరణీయం

తాడేపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సీపీఎంలో అంచెలంచెలుగా ఎదిగి అందరి మన్ననలు పొందిన సోలా ముత్యాలరావు మృతి పార్టీకి తీరని లోటని, ఆయన పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళవారం తాడేపల్లి నేతాజీ సెంటర్‌లో జరిగిన దివంగత నేత సోలా ముత్యాలరావు సంస్మరణ సభలో రామారావు మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నుంచి తన ప్రస్థానం మొదలుపెట్టి డీవైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘంలో పని చేసి క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. తొలుత ముత్యాలరావు చిత్రపటానికి సీపీఎం నేతలు జొన్నా శివశంకర్, దొంతిరెడ్డి వెంకట రెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, కరుణాకర్, గాదె సుబ్బారెడ్డి, కాట్రగడ్డ శివరామ కృష్ణయ్య, సీపీఐ నేత కంచర్ల కాశయ్య, వెంకటయ్య, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.





ఏసీసీ కార్మికుల నిరసన

తాడేపల్లి టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బైండోవర్ కేసులతో సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులను బెదిరిస్తూ వేధింపులు కొనసాగిస్తే జిల్లా వ్యాప్త ఉద్యమం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. మంగళవారం బ్రహ్మానందపురంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పోలీసుల బైండోవర్ చర్యలను నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్మిక నేతలు కూరపాటి స్టీవెన్, ఎస్‌కె బాషా, వై సుబ్బారావు, సూర్యప్రకాష్, వెంకటరత్నం, ఆశీర్వాదం తదితరులను పోలీసులు తీసుకువెళ్లి తహశీల్దార్ వద్ద బైండోవర్ చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రామారావు మాట్లాడుతూ న్యాయంగా రావలసిన బకాయిలు అడుగుతున్న కార్మికులపై కేసులు నమోదు చేయడం సరికాదని అసలు కోర్టు ధిక్కారానికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, ఏఐఎఫ్‌టీయూ నేత కోటేశ్వరరావు, యూనియన్ ప్రతినిధులు కూరపాటి స్టీవెన్, ఆదినారాయణ, సూరి, ఆశీర్వాదం, రమాదేవి, జానీబాషా, నవనీతం, తదితరులు పాల్గొన్నారు.



తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

అనధికార భవన నిర్మాణాలపై చర్యలు: మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పురపాలక సంఘం అనుమతులు లేకుండా నిర్మించే భవన నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు అనుమతులు తీసుకోకుండా బిల్డింగ్ (రెండో అంతస్తు), అపార్టుమెంటుల (అదనపు ఫ్లోర్‌లను) నిర్మాణాలపై నూరుశాతం అపరాధ రుసుమును వసూలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు కమిషనర్ తెలిపారు.

ఉద్యాన శాస్త్రవేత్త మొవ్వా రామారావు మృతి



తెనాలి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): సుప్రసిద్ధ ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మొవ్వా రామారావు (90) అనారోగ్యంతో మంగళవారం తెనాలిలో మృతిచెందారు. డాక్టర్ రామారావు వ్యవసాయ విద్య, పరిశోధన, విస్తరణ రంగాల్లో చేసిన సేవలకు గుర్తింపుగా రైతు నేస్తం 2012లో ప్రద్మశ్రీ డాక్టర్ ఐవీ సుబ్బారావు రైతు నేస్తం పురస్కారంతో సత్కరించింది. డాక్టర్ రామారావు ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యాన విభాగంలో వివిధ హోదాలలో పనిచేశారు. తిరుపతి వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా, కోడూరు ఉద్యాన పరిశోధనా స్థానం అధిపతిగా గుంటూరు లాం వ్యవసాయ పరిశోధనా స్థానం సహచర సంచాలకులుగా, విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులుగా నిరుపమానమైన సేవలు అందించారు. ఉద్యాన పరిశోధనలలో పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. విజవాడ, కడప, హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రాల ద్వారా తనకున్న వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు అందిస్తూ అనేక కార్యక్రమాలు జరిపారు. వృద్ధాప్యంతో ఆయన స్వస్థలం తెనాలిలో స్థిరపడ్డారు. ఆయన కుమారుడు అమెరికాలో ఉండటంతో మృతదేహాన్ని తెనాలి పాండురంగపేటలోని మహాప్రస్థానంలో భద్రపరిచారు. నవంబరు 1న ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. రామారావు మృతి చెందిన విషయం తెలుసుకుని ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించేందుకు పలువురు వ్యవసాయ, ఇతర శాఖల అధికారులు, రైతులు ఆయన స్వగృహానికి వచ్చి కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతిని తెలిపారు.

నవంబరు 7న ఆచార్య ఎన్జీరంగా 124వ జయంతి ఉత్సవాలు

పొన్నూరు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నవంబరు 7వ తేదీన ఆచార్య ఎన్జీరంగా 124వ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తునట్లు కమిటీ నిర్వాహకులు రామినేని కిషోర్ బాబు తెలిపారు. మంగళవారం నిడుబ్రోలు ఎన్జీరంగా స్వగృహం గోభూమిలో జరిగిన సమావేశంలో కిషోర్ బాబు మాట్లాడుతూ గుంటూరు ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ లాంలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తునట్లు తెలిపారు.

గ్రాడ్యుయేట్ ఓట్ల దరఖాస్తులను పరిశీలించాలి

● తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీకి ఓటు నమోదు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేలతో ఆయన ఓటర్ల జాబితాపై సమీక్ష నిర్వహించారు. దరఖాస్తుల పరిశీలనపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 1250మంది ఎమ్మెల్సీ ఓటు హక్కును పొందటానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఓటు నమోదు నిమిత్తం దరఖాస్తులను పరిశీలించి నివేదిక తయారు చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఓటు కోసం నవంబరు 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అదేవిధంగా నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. రైతుల సర్వే నెంబర్లు, టీసీల వారీగా ఓటర్ల జాబితా తయారు చేయాల్సి ఉంటుందన్నారు.

వివాలో జర్మన్ విదార్థుల బృందం పర్యటన

పెదకాకాని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జర్మనీ న్యూంబర్గ్ నగరానికి చెందిన ఓం విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ డాక్టర్ బెరా ర్డ్ ఆధ్వర్యంలో డ్యూరర్, మార్టిన్ బెహం పాఠశాలలకు చెందిన 13 మంది విద్యార్థులు ఆరుగురు ఆధ్యాపకులతో కూడిన బృందం మేథాన్-24 కార్యక్రమంలో భాగంగా వివా పాఠశాలను మంగళవారం సందర్శించింది. మూడు దశలలో జరుగు మే మొదటి దశ అంతర్జాలం ద్వారా నిర్వహించగా, రెండో దశలో వివా విద్యార్థులు జర్మనీలో నిర్వహించిన మేథాన్‌లో పాల్గొన్నారు. మూడవ దశలో భాగంగా జర్మన్ విద్యార్థులు వివా పాఠశాలలో జరిగే మేథాన్‌కు హాజరయ్యాకు నవంబరు 2వ తారీకు వరకూ ఈ బృందం వివా పాఠశాలలో నిర్వహించే మేథాన్ 24లో పాల్గొననున్నారు. జర్మన్ అధ్యాపకులు సంప్రదాయ చీరకట్టులో ఈ కార్యక్రమంలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చదలవాడ సరళ, డైరెక్టర్ ఎల్బీ కమాండర్ కె.శ్రీనివాసరావు, ఐబీ ప్రోగ్రామ్ హెడ్ కె.మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ

చేబ్రోలు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నారాకోడూరు జిల్లా పరిషత్‌లో చదువుతున్న ఐదుగురు విద్యార్థినులకు రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో మంగళవారం సైకిళ్లు అందచేశారు. మండల పరిధిలోని గొడవర్రు గ్రామానికి చెందిన 8, 9 చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు ప్రతిరోజూ పాఠశాలకు రావాలంటే ఇబ్బందులు కలుగుతున్నందున పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బి.వెంకటేశ్వరరావు తెనాలి రోటరీ క్లబ్ నిర్వాహకులను సంప్రదించారు. రూ.30 వేల విలువ కలిగిన ఐదు సైక్కిళ్లను విద్యార్థుకు అందచేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, డి మురళీకృష్ణ, ఈదర పూర్ణచంద్, రాజేంద్రప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యులు, ఏం ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయాలుగా మలుపులు



దావులూరు అడ్డరోడ్డు ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న మలుపు



తూములూరు శివారు ఎస్టీ కాలనీ వద్ద చెట్లతో మూసుకుపోయిన మూలమలుపు

● చెట్లతో మూసుకుపోయి కనిపించని హెచ్చరిక బోర్డులు
● పలుచోట్ల హెచ్చరిక బోర్డులు లేవు
● ఆందోళనలో వాహనచోదకులు

కొల్లిపర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లోని రహదారులలో మూలమలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. మూలమలుపుల్లో ఆర్‌అండ్‌బీ అధికారులు ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతూనే ఉన్నారు. మలుపుల వద్ద ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాలకు గురికాక తప్పదు. దీనివల్ల వాహనచోదకులు తరుచూ ఇక్కట్లు పడుతున్నామని వాపోతున్నారు. మండలంలో ప్రధానంగా దావులూరు అడ్డరోడ్డు అంజనేయస్వామి ఆలయం వద్ద, పిడపర్తిపాలెం మూల మలుపు వద్ద అధికారులు ఎటువంటి ప్రమాద సూచికబోర్డులు ఏర్పాటుచేయలేదు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి తోడు దావులూరు అడ్డరోడ్డు సమీపంలో కల్యాణవారి చెరువు వద్ద మలుపు, తూములూరు ఎస్టీకాలనీ వద్ద ఏర్పాటు చేసిన ప్రమాద హెచ్చరికల బోర్డులు చెట్లతో మూసుకు పోయాయి. దీంతో తరుచూ అక్కడ ప్రమాదాలకు నిలయాలు మారాయి. మూలమలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో అతివేగంగా వెళుతున్న వాహనదారులు పక్కనే ఉన్న పంటకాల్వల్లోకి అదుపుతప్పి పడిపోయిన సంఘటనలు ఎన్నోఉన్నాయి. గతంలో ఈ మలుపుల్లో అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ రోడ్లపై ప్రతిరోజు వందలాది మంది వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్ల మూలమలుపుల్లో చెట్లతో మూసుకుపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మలుపుల గురించి అనేక పర్యాయాలు ఆర్ అండ్‌బీ అధికారులకు తెలియజేసినా ఎటువంటి స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరికలు సంబంధించిన బోర్డులు గురించి ఏమాత్రం పట్టించుకోక పోవడంతో వాహన దారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కొన్నిచోట్ల ఏర్పాటుచేసిన ప్రమాద హెచ్చరికల బోర్డులు చెట్లతో మూసుకుపోయినా అధికారుల్లో ఏమాత్రం చలనం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని, మలుపుల వద్ద పిచ్చిచెట్లను తొలగించాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.



దావులూరు అడ్డరోడ్డు కల్యాణ చెరువు వద్ద చెట్లతో మూసుకు పోయిన ప్రమాద హెచ్చరిక బోర్డు

పాత డబ్బాలతో ట్రాఫిక్ నియంత్రణ

తెనాలి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జనం గొంతెండితే వారి దాహార్తిని తీర్చేందుకు తాగునీటిని అందించిన నీటి డబ్బాలు పాడయిపోయాక కూడా ఉపయోగపడతాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు అమర్చవచ్చని నిరూపించారు తెనాలి ట్రాఫిక్ పోలీసులు. తెనాలి-విజయవాడ ప్రధాన రహదారిని ప్రకాశం రోడ్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మరో రోడ్ క్రాస్ చేస్తుంది. ఈ రెండు రహదారులూ నిత్యం అత్యంత ట్రాఫిక్ రద్దీతో ఉంటాయి. అయితే రెండు వంతెనల మధ్య మెయిన్ రోడ్‌పై అక్కడికక్కడే వాహనాలు క్రాస్ అవుతుంటే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో ట్రాఫిక్‌ను కొద్దిదూరం ముందుకు పంపి, డివైడర్ మార్గం ఉన్నచోట మళ్లేలా పోలీసులు మార్పులు చేశారు. అయితే దీనికోసం పెద్ద ఖర్చు పెట్టాల్సిన పనిలేకుండా పాడయిపోయిన నీటి డబ్బాలు, ఇసుక, ప్లాస్టిక్ పైప్, తాడు సాయంతో ట్రాఫిక్ చిక్కులకు పరిష్కారం చూపారు. 20లీటర్ల నీటి డబ్బాలు పాడయిపోయినవాటిని తీసుకుని పైభాతి కత్తిరించి, దానిలో ఇసుక నింపి, ప్లాస్టిక్‌పైప్ పిల్లర్ తరహాలో నిలిపి, దానికి అడ్డుగా తాడుకట్టారు. వీటిని రోడ్డుపై అడ్డుగా పెట్టటంతో కాలినడకన వెళ్లేవారికి అసౌకర్యం లేకుండా రోడ్డు దాటేందుకు అవకాశం కల్పిస్తూ, వాహనాల క్రాసింగ్ వల్ల ట్రాఫిక్ ఆగిపోయే పరిస్థితి లేకుండా చేయగలిగారు. అదే రోడ్డుపై ప్రయాణించేవారు మాత్రం భారీ ఖర్చుతో దిమ్మెలు పెట్టే పరిస్థితిలేకుండా, తేలికగా, తక్కువ ఖర్చుతో భలే ఏర్పాటు చేశారంటూ చర్చించుకోవటం విశేషం.



తెనాలి-విజయవాడ మెయిన్ రోడ్‌పై రైల్వేస్టేషన్ వంతెన దగ్గర ట్రాఫిక్ మళ్లించేందుకు ఉపయోగించిన పాడయిపోయిన నీటి డబ్బాలు

స్వచ్ఛ పొన్నూరు కోసం పాటుపడదాం



29వ వార్డులో కుళాయి నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, కమిషనర్

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్
● పట్టణంలో ద్విచక్ర వాహనంపై ఎమ్మెల్యే పర్యటన
● వార్డులో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై తనిఖీలు

పొన్నూరు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చి దిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకారం అందించాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. పొన్నూరు పట్టణంలోని ఇట్టికంపాడు రోడ్డు నుంచి తెలగపాలెం వరకు పలు వార్డుల్లో ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ద్విచక్ర, వాహనంపై సంచరిస్తూ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో తాగునీటి కుళాయిల వద్ద ఆగి నీటి నాణ్యత పరీక్షలు చేయించారు. స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో రహదారులపై వదిలివేసిన చెత్తను పరిశీలించి తొలగించాలని ఆదేశించారు. అలాగే అంతర్గత రహదారులు, ప్రధాన రహదారులకు అనుసంధానమైన ప్రాంతాల్లో కల్వర్టు నిర్మాణం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పలు ప్రాంతాల్లో ప్రజలు నరేంద్ర కుమార్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పాలకులు, పట్టణ ప్రగతిని గాలికి వదిలివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల పేరిట పురపాలక సంఘాన్ని వైసీపీ నాయకులు దోచుకుతిన్నారని ఆరోపించారు. ప్రజలు కోరుకున్న ప్రతి అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయనునట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు, టీ లక్ష్మీనారాయణ చౌదరి, చల్లం శెట్టి సీతారామయ్య, ఆరె ప్రసాద్, షేక్ సిలార్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్ల నిర్వాహకులపై చర్యలేవి

● పారిశుధ్య పనులపై కౌన్సిలర్ల నిలదీత

తెనాలి, మారీసుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రజల సౌకర్యం కోసం పురపాలక సంఘం వారు ఏర్పాటుచేసిన మరుగుదొడ్లు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయని పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. పట్టణ పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగాయి. ఉదయం గం.11 లకు సాధారణ సమావేశం మొదలయితే, అజెండాలోని 31అంశాల చర్చించడానికి కౌన్సిల్ ముందుంచారు. రెండో అంశం చదువుతుండగా 3వ వార్డు కౌన్సిలర్ మొగల్ రహమత్ బేగ్ మాట్లాడుతూ పట్టణంలో ఏర్పాటుచేసిన మరుగుదొడ్ల పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని కాంట్రాక్టర్‌పై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని నిలదీశారు. చైర్‌పర్సన్ రాధిక సమాధానమివ్వాలని అధికారులను కోరారు. పురపాలక సంఘ ఆరోగ్యధికారి డాక్టర్ హెలెన్ నిర్మల సమాధానమిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం 9వ అంశం చదువుతుండగా టీడీపీ కౌన్సిలర్ త్రిమూర్తి లేచి ఈ నెల 18వ తేదీన ఆధ్రజ్యోతిలో ప్రచురించిన వైసీపీకి పచ్చధనం అనే కథనంను సభలో చూపుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహనరావు సభకోసం తెప్పించిన రూ.4లక్షల80 మొక్కలు ఏమయ్యాయని అధికారులను నిలదీశారు. మున్సిపల్ ఇన్‌చార్జ్ ఎంఈ శ్రీనివాసరావు సమాధానమిస్తు ఏ మొక్కను అమ్మలేదని కొన్నిటిని రోడ్డు డివైడర్‌లో నాటామని కొన్నిటిని పురపాలక సంఘ గ్రీనరీలో ఉన్నాయని తెలిపారు. సభ్యులు కోరితే క్షేత్రస్థాయిలో పరిశీలించవచ్చన్నారు. ఈ అంశం పూర్తికాగానే 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరావు మాట్లాడుతూ చినరావూరు పార్కులో సమస్యలు ఎక్కువయ్యాయని మంత్రి నాదెండ్ల మనోహర్ పార్కును పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సూచించినప్పటికి ఇంతవరకు చర్యలు చేపట్టలేదన్నారు. కమిషనర్ శేషన్న సమాధానమిస్తూ ఇంజనీరింగ్ విభాగంలో లోపాలు ఉన్న మాట వాస్తమేనని దానిని ప్రక్షాళన చేస్తున్నామన్నారు. 11వ అంశం చదువుతుండగా 17వ వార్డు కౌన్సిలర్ అన్నం పిన్నారావు మాట్లాడుతూ వార్డులో వీధి కుక్కల సమస్య ఎక్కుగా ఉందని వాటి నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. కమిషనర్ శేషన్న సమాధానమిస్తూ కుక్కల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య కౌన్సిల్ హాల్‌లో ఇతర సమావేశాలను నిర్వహించటంపై ప్రశ్నించారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ పురపాలక సంఘ చట్టం ప్రకారం కౌన్సిల్ హాల్‌లో కౌన్సిల్ సమావేశాలు మాత్రమే నిర్వహించాలని, కొన్ని కారణాలవలన ఇతర సమావేశాలకు ఇస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఎజండాలోని అంశాలను అమోదించినట్టు కౌన్సిల్ సభ్యులు తెలిపారు. 1వ అంశాన్ని వాయిదా వేసినట్లు చైర్‌పర్సన్ రాధిక ప్రకటించారు. పలువురు స్వపక్ష విపక్ష సభ్యులు తమ వార్డులలోని రోడ్లను మరమ్మతులు చేయాలని చైర్‌పర్సన్ రాధికను కోరారు. అనంతరం ఇతర రాష్ట్రాలలోని పురపాలక సంఘాలలో జరిగే కార్యక్రమాలను పరిశీలించేదుకు టూరు ఏర్పాటు చేయాలని చైర్‌పర్సన్‌కు స్వపక్ష విపక్ష సభ్యులు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో అధికార, విపక్ష కౌన్సిల్ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన కథనంపై ప్రశ్నిస్తున్న టీడీపీ కౌన్సిలర్ త్రిమూర్తి



దుకాణాలను డ్రా తీసి కేటాయిస్తున్న సబ్ కలెక్టర్ సంజనా సిన్హా

ప్రమాదాలకు తావులేకుండా బాణసంచా విక్రయాలు చేయాలి

● సబ్ కలెక్టర్ సంజనా సిన్హా

తెనాలి అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ప్రమాదాలకు తావు లేకుండా బాణసంచా విక్రయాలు చేయాలని సబ్ కలెక్టర్ సంజనా సిన్హా చెప్పారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం బాణసంచా దుకాణాల కోసం దరఖాస్తు చేసిన వారికి లాటరీ తీసి దుకాణాలు కేటాయించారు. దీపావళి బాణాసంచా విక్రయించేందుకు దరఖాస్తుచేసిన 50మందికి లైసెన్స్‌లు జారీచేశారు. వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చారు. ప్రమాదాలు జరగకుండా దుకాణాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యాపారులకు సూచించారు. అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, మున్సిపల్ శాఖల సమన్వయంతో దీపావళి ప్రశాంతంగా జరిగేలా చూస్తామన్నారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, అధికారులు పాల్గొన్నారు. పట్టణంలో ఎక్కడా కూడా తోపుడు బండ్లపై బాణసంచా విక్రయించడానికి అనుమతులు లేవన్నారు. రెండు రోజులు కళాశాలలో విక్రయాలకు అనుమతులు ఇచ్చారు.

పీఎం సేవా నిధి రుణాలపై

పొన్నూరు పురపాలక సంఘానికి అవార్డు

పొన్నూరు టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులకు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు పీఎం సేవా నిధి పథకం అమలుపై పొన్నూరు పురపాలక సంఘంకు అవార్డు లభించినట్లు మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు తెలిపారు. మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. పొన్నూరు పురపాలక సంఘంలో 1775 మంది వీధి వ్యాపారులకు రూ.2.20 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించారు. వీధి వ్యాపారుల ప్రగతి పాటుపడిన పొన్నూరు పురాలక సంఘంకు ఈ అవార్డు లభించినట్లు తెలిపారు. పురపాలక సంఘం తరపున కమిషనర్ రమేష్ బాబు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నుంచి అవార్డును అందుకున్నారు.



మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నుంచి అవార్డు అందుకుంటున్న కమిషనర్ రమేష్ బాబు

అర్హత ఉన్న వారందరికీ ఉచిత సిలిండర్

● తహసీల్దార్ సిద్ధార్థ



కొల్లిపర, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అర్హత ఉన్నవారందరికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీపం 2 పథకానికి ఉచిత సిలిండర్ వస్తుందని తహసీల్దార్ సిద్ధార్థ మంగళవారం ఆంధ్రజ్యోతితో తెలిపారు.

ప్రశ్న: దీపం 2 పథకానికి అర్హులు ఎవరు?

జవాబు: దీపం 2 పథకానికి అమల్లో ఉన్న గ్యాస్ కనెక్షన్ ఉండి, వైట్‌కార్డు కలిగిన వారు, ఆధార్ నెంబరు గ్యాస్‌కు లింక్ అయిన వారు అర్హులు.

ప్ర: అనర్హతలు ఏమిటి?

జ: ఏ కుటుంబంలో అయితే రెండు గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయో అందులో ఒక కనెక్షన్‌కు మాత్రమే అర్హత ఉంది. ఎవరైతే గ్యాస్ కనెక్షన్ చాలా సంవత్సరాలుగా వాడటం లేదో వారు కూడా అనర్హులవుతారు.

ప్ర: ఈ పథకం పొందటానికి ఏమన్నా రుజులు చూపించాలా?



జ: ఏమీ అవసరంలేదు. డేటా బేస్‌తోనే అర్హులను నిర్ధారిస్తాం.

ప్ర: వినియోగదారుడు ఎప్పుడు బుక్ చేసుకోవచ్చు ?

జ: ఈ నెల అక్టోబరు 29 నుంచి 2025వ సంవత్సరం మార్చి 31లోపు ఎప్పుడైనా బుక్ చేసుకోవచ్చు. ఈ మధ్యకాలంలో బుక్‌చేసిన మొదటి సిలిండర్‌కు దీపం2 పథకం వర్తిస్తుంది. బుక్ చేసుకోగానే అర్హులకు నేరుగా 48 గంటల్లో సబ్సిడీ డబ్బులు పడతాయ్.

ప్ర: అర్హత ఉండి సబ్సిడీ రానివారు ఏమి చేయాలి?

జ: రాష్ట్ర ప్రజా ఫిర్యాదుల పరిష్కారం విభాగం వారు దీనికి ఒక పోర్టల్ రూపొందిస్తున్నారు. అర్హులైన వారు ఈ పోర్టల్ ద్వారా మాకు రాలేదు అని దరఖాస్తు చేసుకుంటే, అర్హులను పథకంలో చేర్చుతారు.



ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఇంద్రజిత్‌ను పరామర్శిస్తున్న మంత్రి మనోహర్

రౌడీషీటర్ల ఆటలు ఇకపై చెల్లవు

● ఆసుపత్రిలో బాధితుడికి మంత్రిమనోహర్ పరామర్శ

తెనాలి రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో రౌడీ షీటర్ల ఆటలు ఇకపై చెల్లవని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. ఐతానగర్‌కు చెందిన సముద్రాల పవన్ అలియాస్ లడ్డు సోమవారం రాత్రి తెనాలి నాజరుపేటకు చెందిన కాకుమాను ఇంద్రజిత్‌పై అకారణంగా దాడిచేసి గాయపరచడంతో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. గాయపడిన బాధితుడిని మంత్రి మనోహర్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం శాంతి భద్రతలను గాలికొదిలేసి రౌడీషీటర్లను పెంచిపోషించిందన్నారు. ఆ ప్రభుత్వం పోయినా ఇంకా అదే భ్రమతో కొందరు రౌడీషీటర్లు దాడులకు పాల్పడుతున్నారు. దాడి జరిగిన తీరుపై బాధితుడు ఇంద్రజిత్‌ను వారి కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. లా అండ్ ఆర్డర్ అమలు చేయడంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. ఇప్పటికే రౌడీల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఆదేశించామన్నారు. గత ఎన్నికల సమయంలో కూడా ఇదే రౌడీషీటర్ రోడ్లపై వెళ్లే వారిని అకారణంగా దాడులుచేసి గాయపరిచిన ఉదంతాలను ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని, మరోమారు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి మనోహర్ స్పష్టం చేశారు. బాధితుడికి మెరుగైన వైద్యసేవలందించాలని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణిని మంత్రి మనోహర్ ఆదేశించారు. ఆయన వెంట పలు శాఖల అధికారులు, పలువురు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

వైసీపీ పాలకుల నిర్ణయాలతో కుంటుపడిన పట్టణ ప్రగతి

● మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆకుల సాంబశివరావు

పొన్నూరుటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలతో పట్టణ ప్రగతి పూర్తిగా కుంటుబడిపోయిందని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆకుల సాంబశివరావు ఆరోపించారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆకుల సాంబశివరావు తదితరులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి ప్రజా ప్రతినిధి కిలారి వెంకటరోశయ్య, పొన్నూరు పురపాలక సంఘం విస్తరణ పేరుతో ఆరు గ్రామ పంచాయతీలను విలీనంచేసే ప్రతిపాదనలు చేశారన్నారు. అయితే ఈ ప్రక్రియలో జరిగిన తప్పులతో పురపాలక సంఘంకు, విలీన ప్రతిపాదిత గ్రామాల్లో ఐదేళ్లుగా ఎన్నికలు నిల్చిపోయి ప్రజాపాలన నిల్చిపోయిందన్నారు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం నుంచి పురపాలక సంఘానికి రావాల్సిన కోట్లాది రూపాయల నిధులను నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలుగా కూటమి ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పట్టణంలో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణానికి నిధులు సాధించారన్నారు. పొన్నూరు పురపాలక సంఘ అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. కిలారి రోశయ్య హయాంలో రహదారులు మురుగు కాల్వల నిర్మాణం పేరిట నాశిరకం పనులు చేసి లక్షలాది రూపాలయ ప్రజా ధనాన్ని దోపిడీ చేశారని, వీటిపై విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరనునట్లు తెలిపారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్లు అలపర్తి చంద్రమోహన్, పిన్నమనేని కోటేశ్వరరావు, లత, ఎద్దు శోంబాబు, తోట ప్రసాద్, షేక్ బాజీ సాహెబ్, మహ్మద్‌గౌస్, అనిశెట్టి వీరబాబు, లక్ష్మీ నారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

